



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 73 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శనివారం 06 డిసెంబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


## 'కలలకు రెక్కలు' పథకంతో

# విదేశీ విద్యకు సహకారం

- పావలా వడ్డీకే విదేశీ విద్య రుణాలు
- త్వరలో స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్టనర్‌షిప్ సమ్మిట్
- మూడేళ్లల్లో ఆంధ్రప్రదేశ్ విద్యా విధానానికి దేశంలోనే గుర్తింపు దక్కాలి
- పిల్లల్లో నైపుణ్యాలను గుర్తించాలి... మట్టిలో మాణిక్యాలను వెలికితీయాలి
- ప్రైవేట్ కంటే ప్రభుత్వ స్కూళ్లల్లోని టీచర్లే బెస్ట్
- విద్యాశాఖను సమర్థవంతంగా నిర్వహిస్తోన్న మంత్రి లోకేష్‌కు అభినందనలు
- మెగా పేరెంట్ టీచర్ మీటింగ్-3.0 కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- భామిని ఏపీ మోడల్ స్కూలును పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించిన సీఎం చంద్రబాబు

**పార్వతీపురం మన్యం జిల్లా, భామిని, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థుల ఉన్నత విద్యకు, విదేశీ విద్యకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దీనికోసం 'కలలకు రెక్కలు' పథకాన్ని ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. విదేశీ విద్య కోసం ఎంత ఖర్చు అవుతుందో అంత మేర పావలా వడ్డీకే రుణం ఇప్పిస్తామని సీఎం ప్రకటించారు. ఉన్నత, విదేశీ విద్య అభ్యసించాలనే కోరికలు, ఆశలను విద్యార్థులు చంపుకోవాల్సిన అవసరం లేదన్నారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్-3.0 కార్యక్రమంలో భాగంగా సీఎం చంద్రబాబు పార్వతీపురం మన్యం జిల్లాలో పర్యటించారు. ఈ జిల్లాలోని పాలకొండ నియోజకవర్గం, భామిని గ్రామంలో మిగతా 2లో



### జగన్.. వివేకా హత్యతో సంబంధం లేదని

## అంగీకరించగలరా..?

మంత్రి సంధ్యారాణి

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గత ప్రభుత్వంలో తప్పులు చేసి మమ్మల్ని విమర్శిస్తారా అని మంత్రి సంధ్యారాణి ప్రశ్నించారు. పదేపదే అబద్ధాలు ఆడటం మాజీ సీఎం జగన్‌కు అలవాటుగా మారిందని విమర్శించారు. వైకాపా హయాంలో బకాయిలుగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, డైట్ బిల్లులు తామే చెల్లించామన్నారు. భోజనం, యూనిఫాం, పుస్తకాలు, కాస్మోటిక్స్ పిల్లలకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. "వివేకా హత్యతో సంబంధం లేదని మీరు అంగీకరించగలరా? తల్లి, చెల్లిని ఇంట్లోంచి గెంటేసింది మీరు కాదా? గిరిజనుల మరణాలపై శవ రాజకీయాలు చేస్తున్నారు. గిరిజనులను చులకన చేసి మిగతా 2లో




## 'అఖండ-2' ఫైనాన్షియల్ ఇష్యూ...

- స్పందించిన నిర్మాత సురేష్‌బాబు



**విశ్వం వాయిస్ న్యూస్ :** 'అఖండ 2' వాయిదాపై అనేక వార్తలు రావడం దురదృష్టకరమని నిర్మాత సురేశ్‌బాబు అసహనం వ్యక్తం చేశారు. త్వరలోనే సమస్య పరిష్కారం అవుతుందని సినిమా విడుదలవుతుందని తెలిపారు. శ్రీనందు హీరోగా నటిస్తున్న 'సైక్ సిద్ధార్థ' సాంగ్ లాంఛ్ కార్యక్రమంలో మిగతా 2లో



## అమెరికా ఆంక్షలు ఫలించకపోవచ్చు...

- పుతిన్ పర్యటపై 'చైనా' వ్యాఖ్యలు

**విశ్వం వాయిస్ న్యూస్ :** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనను ప్రపంచ దేశాలు ఆసక్తిగా చూస్తున్నాయి. అమెరికా ఆంక్షలు, సుంకాల మధ్య ఆయన భారత్‌కు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ క్రమంలో చైనా మీడియా కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రపంచంలో ఏ దేశమూ ఒంటరి కాదన్న స్పష్టమైన సందేశాన్ని పుతిన్ పర్యటన చాటుతోందని అభిప్రాయపడింది. చైనా ఫారిన్ అఫైర్స్ యూనివర్సిటీలోని ప్రొఫెసర్ లీ హైడాంగ్ గ్లోబల్ టైమ్స్‌తో మిగతా 2లో



### తెలంగాణా అభివృద్ధిలో

## రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలకపాత్ర

- కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణ అభివృద్ధిలో రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలక పాత్ర పోషించనుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సోనియాగాంధీ సందేశం పంపించారు. రాష్ట్రాభివృద్ధికి మిగతా 2లో

## ఏఐ ఆధారిత వృద్ధిలో ఏపీది కీలకపాత్ర

కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏఐ ఆధారిత వృద్ధిలో ఏపీది కీలకపాత్ర పోషిస్తోందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. 2026 ఫిబ్రవరిలో భారత్‌లో నిర్వహించబోతున్న ఏఐ వరల్డ్ సమ్మిట్‌లో భాగంగా ఏపీకి భాగస్వామ్యం కల్పించాలని రాజ్యసభలో తెదేపా ఎంపీ బీద మస్తాన్‌రావు కోరగా.. సదస్సులో భాగంగా దేశ వ్యాప్తంగా 200 కార్యక్రమాలు చేపడతామని కేంద్రమంత్రి సమాధానమిచ్చారు. ఏపీ, మహారాష్ట్ర, యూపీ తదితర రాష్ట్రాల్లో డేటా సెంటర్లు వస్తున్నాయన్నారు. డేటా సెంటర్ల కేంద్రంగా విశాఖ ఎదగడం శుభపరిణామమన్నారు.





## ఆలయ డబ్బును బ్యాంకుల మనుగడకు వాడొద్దు : సుప్రీంకోర్టు

**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆలయాలకు చెందిన డబ్బును ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కో-ఆపరేటివ్ బ్యాంకులను రక్షించేందుకు ఉపయోగించొద్దంటూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆ సొమ్ము పూర్తిగా దేవుడికి చెందినదని తేల్చి చెప్పింది. ఆ నిధులను ఆలయ ప్రయోజనాలకు మాత్రమే ఉపయోగించాలని మిగతా 2లో



### సన్నబియ్యం ద్వారా

## పేదల ఆకలి తీరుస్తున్నాం..

తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**నర్సంపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** "వరంగల్ విమానాశ్రయం కోసం గత సీఎం కేసీఆర్ ఏనాడూ ప్రయత్నించలేదు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి కొత్తగా ఒక్క ఎయిర్‌పోర్టును కూడా సాధించలేదని" సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. ప్రజాపాలన మిగతా 2లో

### విద్యార్థులను దేశానికి పనికొచ్చే

## శక్తులుగా తయారుచేయాలి

- తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య నిరంతర సమన్వయం అవసరం
- కేరళ తరహా విద్యావిధానం అమలు అవసరం
- రాష్ట్ర ఐ.టి., మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ చొరవతో చేపట్టిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు మంచి ఫలితాలు ఇస్తాయి
- జెన్‌జీ కాలంలో విభిన్న రంగాల్లో సృజన అందరికీ అవసరం
- పుస్తకాలు చదవడం మనల్ని ఉన్నతంగా నిలబెడుతుంది... గ్రూప్ లైబ్రరీలు ఏర్పాటు కావాలి
- గంజాయి, మాదక ద్రవ్యాలు లేని సమాజాన్ని కలిసికట్టుగా నిర్మిద్దాం
- చిలకలూరిపేట శారదా జడ్పీ హైస్కూల్ లో నిర్వహించిన మెగా టీచర్స్ - పేరెంట్స్ మీటింగ్‌లో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్



**చిలకలూరిపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** 'తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు సుహృద్భావ సంబంధాలుండాలి. వారి మధ్య ఎంతటి మంచి వాతావరణం ఉంటే పిల్లల్లోనూ అట్లాంటి పాజిటివ్ దృక్పథం ఏర్పడుతుంది. జీవితంలో ఎదగాలంటే క్రమశిక్షణ అనేది ప్రతి ఒక్కరికీ అవసరం. మీ వ్యక్తిత్వం లేదా చదువు విషయాల్లో గురువులు మిగతా 2లో

# 'కలలకు రెక్కలు' పథకంతో విదేశీ విద్యకు సహకారం






(మొదటిపేజీ తరువాయి)

ఏపీ మోడల్ హైస్కూల్లో జరిగిన పీటీఎం 3.0 కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పేరెంట్, టీచర్, విద్యార్థులతో సీఎం మాట్లాడారు. మోడల్ స్కూల్లో ఏర్పాటు చేసిన వివిధ ల్యాబ్స్ ను పరిశీలించారు. అలాగే క్లిక్కర్ టూల్ ద్వారా విద్యార్థులకు ఎలాంటి బోధన చేస్తున్నారనే అంశాన్ని స్వయంగా పిల్లలతో కలిసి కూర్చుని చూశారు. ఈ సందర్భంగా భామిని ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'రాబోయే కాలంలో విద్యా వ్యవస్థలో ఎవ్వరూ ఊహించని ఫలితాలు వస్తాయి... దీనికి అందరూ సహకరించాలి. మూడేళ్లలో దేశంలోనే నెంబర్ వన్ చేసేలా ఆంధ్రా స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ తెస్తానని మంత్రి లోకేష్ చెప్పారు. పిల్లలను సానబెడితే అద్భుతాలు సాధిస్తారు. విద్యలో పిల్లల బలాబలాలు తెలుసుకునేందుకు... దానికి అనుగుణంగా విశ్లేషించుకుని స్కై, మౌంటెన్, స్టీమ్ అనే మూడు రకాలుగా వర్గీకరించారు. క్లిక్కర్ అనే విధానం పిల్లలను మరింత ఆసక్తిగా చదువుకునేలా చేస్తోంది. నేను అనుకున్నదానికంటే విద్యా విధానం మెరుగ్గా ఉంది. పిల్లలు కూడా వాటిని అందిపుచ్చుకుంటున్నారు. పరీక్షలు జరిగిన తర్వాత సమర్థత తెలుసుకోవడం కాకుండా... ఎప్పటికప్పుడు పిల్లల చదువును విశ్లేషించేలా క్లిక్కర్ బాగా పని చేస్తోంది. పిల్లలు మట్టిలో మాణిక్యాలు... సరైన గైడెన్స్ ఉంటే ఏదైనా సాధించగలరు. అంధ క్రికెట్ క్రీడాకారిణి కరుణ కుమారి ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని అంధ మహిళల క్రికెట్ ప్రపంచ కప్ ను సాధించింది. విద్యా విధానానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది... నిరంతరం ఫీడ్ బ్యాక్ తీసుకుంటోంది. అందుకే మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాం. అంతే కాకుండా... ఈ తరహా సమావేశాల్లో అందరూ పాల్గొంటున్నాం. పల్నాడులో మెగా పీటీఎంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. అలాగే ప్రజా ప్రతినిధిలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.'అని ముఖ్యమంత్రి చెప్పారు.

**కష్టంగా కాదు... ఇష్టంగా చదవండి..**

'ఒకప్పుడు పిల్లలు భారం అనుకునేవారు... కానీ ఇప్పుడు పిల్లలే ఆస్తి, పిల్లలే శ్రీరామ రక్ష, పిల్లలే భవిష్యత్. మధ్యాహ్న భోజనం నుంచి స్టూడెంట్ కిట్స్ వరకు నాణ్యత పెంచాం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని రుచికరంగా, నాణ్యతతో అందిస్తున్నాం. స్టూడెంట్ కిట్లపై పార్టీ రంగులు, చిహ్నాలు, ఫొటోలు లేకుండా అందిస్తున్నాం. విలువలతో కూడిన సమాజాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో పని చేస్తున్నాం. దానికి సహకరించాలని చాగంటి కోటేశ్వరరావును కోరాం చాగంటి ప్రవచనాల ద్వారా విలువలను విద్యార్థులు చక్కగా అర్థం చేసుకుంటున్నారు. గతంలో టీచర్లకు చాలా యాప్ లు ఉండేవి. ఇప్పుడు అలాంటి ఇబ్బందులను తొలగించాం. శనివారం నో బ్యాగ్ డే... ఆడుతూ పాడుతూ విద్యార్థులకు నచ్చిన పని చేస్తున్నారు. 24 గంటలు రుద్దితే చదువు అబ్బదు.. ఇష్టంతో తక్కువ సమయం చదివినా రాణిస్తారు. చదువులో వెనుకబడ్డ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. షైనింగ్ స్టార్స్ పేరుతో ప్రతిభా అవార్డులు ఇస్తున్నాం. విద్యలో నాణ్యత ప్రమాణాలను పరిశీలించేందుకు క్లస్టర్ అప్రోచ్ ద్వారా ప్రయత్నిస్తున్నాం. ప్రపంచంలో ఉన్న బెస్ట్ లెర్నింగ్ విధానాలు అధ్యయనం చేస్తున్నాం. విదేశాలకు వెళ్లి టీచర్లు అధ్యయనం చేస్తున్నారు. టీచర్లను రిక్రూట్ చేయకుండా చదువు చెబితే అది బూటకమే అవుతుంది. ప్రభుత్వ టీచర్లను నియమించాం... చక్కటి చదువు చెప్పిస్తున్నాం. మెగా డీఎస్సీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ దాన్ని సమర్థంగా ఎదుర్కొని ఏడాదిలోనే ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశాం. ట్రాన్స్‌ఫర్లను పారదర్శకంగా నిర్వహించాం. పిల్లలకు అవసరమైన విద్యను అందిస్తాం... దాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అలాగే సామాజిక బాధ్యతగా డ్రగ్స్ వ్యతిరేక ప్రచారాన్ని ముమ్మరంగా చేపట్టే బాధ్యత విద్యార్థులకూ ఉంది.' అని సీఎం సూచించారు. 'ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ఒక టీచరుకు 18 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు. కానీ ప్రైవేట్ స్కూళ్లలో ఒక టీచరుకు 25 మంది పిల్లలు ఉన్నారు. అంటే ప్రభుత్వ స్కూళ్లే బెటర్ అని అర్థమవుతుంది. స్కూళ్లకు ఇంత మంది టీచర్లను రిక్రూట్ చేశాం... ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని అందరూ కోరుకునే పరిస్థితి రావాలి. గతంలో టీచర్లను అవమానించారు... మద్యం షాపుల దగ్గర నిలబెట్టారు. టీచర్లను గౌరవించే బాధ్యత మాది... పిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దే బాధ్యత టీచర్లది. ఏపీ విద్యా రంగాన్ని దేశంలో నెంబర్ 1 చేయాలి. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను అస్తవ్యస్థం చేసింది... మేం సరి చేస్తున్నాం. విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించాం... పిల్లలు అదరగొట్టారు. వచ్చే ఏడాది జనవరిలో స్టూడెంట్స్ ఇన్నోవేటర్స్ పార్టనర్షిప్ సమ్మిట్ నిర్వహించాలని భావిస్తున్నాం. ఏడో తరగతి నుంచి వినూత్నంగా ఆలోచించాలి. గ్రూప్ గా... వ్యక్తిగతంగా ఇన్నోవేషన్స్ చేసేలా ఆలోచన చేయాలి. ఇన్నోవేటివ్ గా ఆలోచించే వారిని జిల్లాల స్థాయిలో గుర్తిస్తాం. ఆ తర్వాత రాష్ట్ర స్థాయిలో జరిగే ఇన్నోవేటర్స్ పార్టనర్ షిప్ సదస్సులో పాల్గొనే అవకాశం కల్పిస్తాం. ఆ సదస్సుకు వివిధ ప్రముఖ కంపెనీలకు చెందిన పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తాం. పిల్లల ఆలోచనలు బాగుంటే వారి ప్రతిభను గుర్తించి రివార్డులు అందిస్తాం. ప్రభుత్వ పాఠశాలల్లోనూ సోలార్ ప్యానెళ్లు పెట్టుకుని విద్యుత్ ఉత్పత్తి చేయాలి.'అని ముఖ్యమంత్రి సూచించారు.

**ఏపీలోని విద్యార్థుల బాధ్యత విద్యా శాఖ మంత్రిదే..**

'మంత్రి లోకేష్ చదువుకునే రోజుల్లో ఎలా చదువుతున్నారనే విషయమాన్ని తెలుసుకునేందుకు నేను ఎప్పుడూ స్కూలుకు వెళ్లలేదు... లోకేష్ కు చదువు చెప్పే టీచర్లతో నేను ఎప్పుడూ మాట్లాడలేదు. అంతా లోకేష్ తల్లి భువనేశ్వరీనే చూసుకునేవారు. కొన్ని అంశాల్లో లోకేష్‌కు ఫౌండేషన్ కోర్సుల్లో శిక్షణ ఇప్పించాం.. ఆ తర్వాత చక్కగా చదువుకున్నారు... ఇప్పుడు మంత్రి అయ్యారు. రాజకీయాల్లోకి రమ్మని లోకేష్‌ను నేను ఫోర్స్ చేయలేదు. వ్యాపారం మీద ఇంట్రెస్ట్ ఉంటే వ్యాపారమే చేసుకోవాలని కూడా సూచించాను. కానీ లోకేష్ రాజకీయాల్లోకి ఇష్టంతో వచ్చారు. విద్యా శాఖ చాలా కష్టంగా ఉంటుందని చెప్పినా... విద్యా విధానాన్ని తీర్చిదిద్దేలా పని చేస్తానని లోకేష్ చెప్పారు. దానికి అనుగుణంగానే విద్యాశాఖను సమర్థవంతంగా నిర్వహిస్తున్నందుకు మంత్రి లోకేష్‌ను అభినందిస్తున్నా. భువనేశ్వరి లోకేష్ ను స్టాన్ ఫోర్డ్ వరకు తీసుకెళ్లారు... ఇప్పుడు రాష్ట్ర విద్యార్థులను కూడా ఆ స్థాయికి తీసుకెళ్లాల్సిన బాధ్యత విద్యా శాఖ మంత్రి లోకేష్ దే.'అని ముఖ్యమంత్రి అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అమలు అవుతున్న ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలన్నీ పాటించాలని ముఖ్యమంత్రి సూచించారు. సభ అనంతరం విద్యార్థులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేష్, ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సహా విద్యా శాఖ ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు.

# విద్యార్థులను దేశానికి పనికొచ్చే శక్తులుగా తయారుచేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఒక దెబ్బ వేస్తే దాన్ని సీరియస్ గా తీసుకోవల్సిన అవసరం లేదు. అవి మనం ఆకాశమంత ఎదిగిన తర్వాత గురువు ఆశీర్వాదాలుగా గుర్తుండిపోతాయ'ని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ చెప్పారు. పాఠశాలల్లోని విషయాలను కూడా రాజకీయం చేసేందుకు చాలా మంది సిద్ధంగా ఉన్నారని, ఇటీవల పిఠాపురంలో జరిగిన చిన్న సంఘటనకు రాజకీయ రంగు పులిమి చిన్నారులను దానిలోకి లాగే ప్రయత్నం చేశారని తెలిపారు. ఇలాంటి వారి పట్ల పెద్దలు, పిల్లలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వేలాది ఎకరాలను కొల్లగొట్టే ఘనులు ఉన్న సమాజంలో పిల్లలకు ఆడుకోవడానికి పాఠశాలల్లో ఆటస్థలాలు లేకపోవడం విచారకరమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాల్లో భాగంగా చిలకలూరిపేట శారదా జడ్పీ హైస్కూలులో పవన్ కళ్యాణ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "నేటి రోజుల్లో విభిన్న సృజన అనేది ప్రతి విద్యార్థికి అవసరం. గురువులు కూడా కేవలం విద్యార్థులను జీతగాళ్లుగా తయారు చేసే పద్ధతికి స్వస్తి చెప్పి, దేశానికి పనికొచ్చేలా తీర్చిదిద్దాలి. పిల్లల్లోని సృజనను గుర్తించి వారిని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యతను తీసుకోవాలి. కేరళ తరహాలో విద్యార్థి, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య నిరంతరం సమన్వయం చేసుకునేలా ముందుకు సాగాలి. రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ వల్ల విద్యార్థుల భవిష్యత్తు మీద అందరికీ అవగాహన ఏర్పడుతుంది. విద్యార్థి బలాలు, బలహీనతలు తెలుస్తాయి. వాటిని ఎలా ఉపయోగించుకోవాలి.. ఎలా అధిగమించాలో ఇటు తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు తెలుస్తుంది. దీనివల్ల మంచి ఫలితాలు వస్తాయి. గురువును దైవంగా భావించే సంస్కృతి మనది. గురువులు కేవలం పాఠాలే కాదు జీవితాలు చెబుతారు. వారి మార్గదర్శకంలో మనం ఎంతో ఎదుగుతాం. నాకు చిన్నప్పుడు సోషల్ టీచర్ చెప్పిన దేశభక్తి పాఠాలు, గొప్ప నాయకుల చరిత్రలు నన్ను ఎంతో ఆలోచింపజేశాయి. ఈనాడు మీ ముందు ఇలా ఉన్నానంటే గురువులు చెప్పిన పాఠాలే ప్రధాన కారణం.




**ఉన్న స్థలాలు దోచుకుపోయేవారు ఎక్కువయ్యారు**

గతంలో పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించేవారు. ఐఏఎస్ కృష్ణతేజ తాతగారు మైలవరపు గుండయ్య వందల ఎకరాల భూమిని ప్రజాహితం కోసం దానం చేశారు. మైలవరపు గుండయ్య పేరు మీద ఒక చౌక్ ఉందీ అంటే ఎంత దానశీలి అనేది తెలుస్తుంది. ఇక్కడి స్కూల్‌కి తోట చంద్రయ్య స్థలం దానం చేశారని అధికారులు తెలిపారు. విద్యార్థులకు, మనకు అలాంటి పెద్దల దీవెనలు ఉండాలి. అయితే నేటి రోజుల్లో అలాంటి పరిస్థితి లేదు. ఉన్న స్థలాలను దోచుకుపోయేవారు ఎక్కువయ్యారు. ఇటీవల నేను మైసూరవారిపల్లె వెళ్లినపుడు అక్కడున్న పాఠశాలకు ఆట స్థలం లేదు అని తెలిసి, స్వయంగా నేను కొనుగోలు చేసి ఇచ్చాను.

**లైబ్రరీ నిండుగా పుస్తకాలు.. 25 కంప్యూటర్లు అందిస్తాను**

ఇప్పుడు కూడా శారద పాఠశాలకు సందర్శించినపుడు గ్రంథాలయంలో తగినన్ని పుస్తకాలు లేవని అర్థమైంది. పాఠశాలకు విభిన్నమైన పుస్తకాలతోపాటు వాటిని భద్రపరుచుకునేందుకు బీరువాలను అందజేస్తాను. ఇక్కడ లైబ్రరీ నిండుగా తెలుగు, ఇంగ్లీష్, హిందీ పుస్తకాలు ఇస్తాను. అలాగే 25 కంప్యూటర్లను పాఠశాలకు ఇస్తాను. ఆట స్థలం కోసం అధికారులు స్థలం కోసం ప్రణాళిక సిద్ధం చేయాలి.

**చదువుతోనే అద్భుతాలు జరుగుతాయి**

చదువు అనేదే సమాజంలో ఉన్నతంగా నిలబెడుతుంది. డబ్బు, వస్తువులు మన దగ్గర నుంచి వెళ్లిపోవచ్చు. చదువు మాత్రం ఎప్పుడు మన దగ్గర ఉండే శక్తి. సృజనాత్మక, శాస్త్రీయమైన చదువు ద్వారా అద్భుతాలను ఆవిష్కరించొచ్చు. కేవలం పాఠ్యపుస్తకాలే కాదు వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, మహనీయుల చరిత్రలు, ఇతర పుస్తకాలను చదవడం ద్వారా ఉన్నతంగా ఎదగొచ్చు. జీవితాన్ని అద్భుతంగా మలుచుకోవచ్చు. దీన్ని గురువులు, తల్లిదండ్రులు కూడా గుర్తుంచుకొని పిల్లలను ప్రోత్సహించాలి. గ్రూప్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి. వాటి ద్వారా పిల్లల్లో చదివే అలవాటు పెంచాలి. పిల్లలు ఉదయించే సూర్యులు. ఉత్తేజాన్ని నింపే సమాజాన్ని ఏర్పాటు చేయాలి. గురువులు ఒక్కోసారి అలసిపోవచ్చు. గురువుతో తినే చిన్న దెబ్బలే జీవితంలో మనకు గుర్తుండిపోతాయి.

**మార్కుల కోసం కాదు... భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని చదవండి**

జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే వినూత్నమైన ఆలోచనలు, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని చదవాలి. తమిళనాడు రాష్ట్రం రామేశ్వరంలో పుట్టిన డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం 'మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా ఎదిగారు. నేడు భారతదేశ రక్షణ క్షిపణి వ్యవస్థకు ఒక మూలస్తంభంగా మారారు. ఆయన చదువుకున్నది ఇంగ్లీష్ మీడియంలో కాదు... తమిళ మీడియంలో. మార్కులు కోసం కాకుండా భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని చదివితే ఇలాంటివి అద్భుతాలు సాధించవచ్చు.

**పిల్లలను బాధ్యత గల వ్యక్తులుగా తీర్చిదిద్దండి**

ఉపాధ్యాయులకు కూడా నా విన్నపం... దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని విద్యార్థులను తీర్చిదిద్దాలి. రేపటి సమాజం కోసం వారిని తయారు చేయాలి. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావుల చరిత్ర గురించి మా సోషల్ టీచర్ చెప్పిన పాఠాలు... నా గుండెల్లోకి బలంగా వెళ్ళాయి. ఆ పాఠాలే నాలో సామాజిక బాధ్యతను పెంచాయి. ఈ రోజు సమాజానికి ఇంత చేయగలుగుతున్నాం అంటే దానికి ఆనాడు పడిన బీజమే కారణం. ప్రతి విద్యార్థిలో నిగూఢంగా అద్భుతమైన శక్తి దాగి ఉంటుంది. దానిని తల్లిదండ్రులు నిశితంగా గమనించాలి. పిల్లలు వారి లక్ష్యాలను చేరుకోవడానికి ప్రోత్సహించడం, వారికి మంచి విలువలు బోధించి సరైన మార్గం చూపించడం తల్లిదండ్రుల బాధ్యత. బూతులు తిట్టే వ్యక్తుల మాటలు వినవద్దు. వాటి కోసం టీవీలు చూడవద్దు. సినిమాల పిచ్చిలో వారిని పడకుండా చూడాలి. సినిమా అనేది వినోదంలో ఒక చిన్న భాగం మాత్రమే. వారికి మన శాస్త్రవేత్తల చరిత్ర, వారు సాధించిన విజయాలు, సమాజంలో గొప్ప గొప్ప వ్యక్తుల జీవితాలను పాఠాలుగా చెప్పి పెంచాలి. మీరు కూడా రేపు పెరిగి పెద్దయ్యాక వారిలా తయారవ్వాలని ప్రోత్సహించాలి. విద్యార్థుల ఆలోచన, ప్రవర్తన, వ్యక్తిత్వమే మన దేశ భవిష్యత్తును నిర్ణయిస్తుందని గుర్తించుకొని పిల్లలను పెంచాలి.

**గంజాయి, మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపండి**

సమాజంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది. గంజాయి ప్రమాదం కాదు అని కొందరు మాట్లాడే స్థితికి వచ్చారంటే ... సమాజం ఎంత ప్రమాదకర స్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వ హయాంలో గంజాయిని రకరకాల పద్ధతుల్లో విస్తృతంగా వ్యాపించజేశారు. గంజాయిని చాక్లెట్లు, బిస్కెట్ల రూపంలోనూ వ్యాప్తం చేశారు. దానిపై ఎప్పటికప్పుడు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. విద్యార్థుల నడవడికపై ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు దృష్టిసారించాలి. గంజాయి, మాదకద్రవ్యాల బారినపడితే విద్యార్థులు భవిష్యత్తును కోల్పోతారు. కూటమి ప్రభుత్వం గంజాయి నిరోధంపై సీరియస్ గా దృష్టికి పెట్టింది. దీనికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సహకరించాలి. జ్ఞానం అనేది ఉన్నతమైనది, విస్తృతమైనది. దాని కోసం నిరంతరం విద్యార్థులు సాధన చేయాలి" అన్నారు. ఈ సమావేశంలో చిలకలూరుపేట శాసనసభ్యులు పత్తిపాటి పుల్లారావు, గుంటూరు జడ్పీ చైర్ పర్సన్ కత్తెర క్రిస్టినా, ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యా శాఖ డైరెక్టర్ పి. రంజిత్ బాషా, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రత్నజ్యోతి, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షురాలు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులతో ఉప ముఖ్యమంత్రి మమేకం**

చిలకలూరిపేట స్థానిక శారదా జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన మూడో మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్‌లో ముఖ్య అతిథిగా పాల్గొనడానికి వచ్చిన పవన్ కళ్యాణ్ విద్యార్థులతో మమేకమయ్యారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు పరిశీలించారు. స్కూల్ లైబ్రరీని పరిశీలించి విద్యార్థులకు అందుబాటులో ఉంచిన పుస్తకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తయారుచేసిన సైన్స్ పరికరాలు, హ్యాండీక్రాఫ్ట్ చూసి మురిసిపోయారు. ఆటల్లో ప్రతిభ కనబరిచిన వారిని అభినందించారు. తరగతి గదిలో విద్యార్థులతో కలిసి బెంచ్ మీద కూర్చొని వారితో కాసేపు ముచ్చటించారు.

**హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పరిశీలన**

కూటమి ప్రభుత్వం ప్రయోగాత్మకంగా తీసుకొచ్చిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డును విద్యా శాఖ అధికారులు శ్రీ పవన్ కళ్యాణ్ గారికి చూపించారు. విద్యాభివృద్ధి, సామాజిక నైపుణ్యాలు, భావోద్వేగ సమతుల్యత, మేథో సామర్థ్యాలు, సైన్స్ ప్రయోగాల పరిస్థితి, ఆటల్లో రాణింపు తదితర కోణాల్లో పిల్లల సమగ్ర వికాసానికి సంబంధించిన అంశాలను ఇందులో నమోదు చేస్తున్నట్లు వివరించారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారు ప్రతి విద్యార్థి దగ్గరకు వెళ్లి వాళ్ల రిపోర్టు పరిశీలించి అభినందించారు.

# అమెరికా ఆంక్షలు ఫలించకపోవచ్చు...

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ పుతిన్ పర్యటనపై కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్-రష్యా ఎవరిపైనా ఆధారపడకుండా, తమ సామర్థ్యాలను తామే సొంతంగా, మరింత శక్తిమంతంగా తయారుచేసుకోవాలని నిర్ణయించుకున్నాయని అర్థమవుతోందన్నారు. ఇరు దేశాల మధ్య సమన్వయం, సహకారమే అందుకు నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ఉభయ పక్షాలూ పరస్పర మద్దతుతో బలమైన బంధాన్ని ఏర్పరచుకున్నాయన్నారు. ఫలితంగా అమెరికా సహా పశ్చిమ దేశాల ఆంక్షలు, ఒత్తిడి అంతగా ఫలించకపోవచ్చని విశ్లేషించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం రాత్రి పుతిన్ దిల్లీకి చేరుకున్న విషయం తెలిసిందే. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. పశ్చిమ దేశాల ఆంక్షల నేపథ్యంలో పుతిన్, మోదీ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. అమెరికాతో భారత్ సంబంధాలు కొంత దెబ్బతిన్న నేపథ్యంలోనూ ఇది కీలకంగా మారింది.

## తెలంగాణా అభివృద్ధిలో
# రైజింగ్ గ్లోబల్ సమిట్ కీలకపాత్ర

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించిన కీలక ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కావాలనుకునే వారికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందన్నారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ వ్యవసాయాభివృద్ధి ప్రాజెక్టులకు సమ ప్రాధాన్యం ఇచ్చేలా మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతోందని సోనియా తన సందేశంలో పేర్కొన్నారు. తెలంగాణలోని మానవ, సహజ వనరులు, ప్రజల వ్యాపార, సాంకేతిక నైపుణ్యాలు, అంతర్జాతీయ ప్రతిభ అభివృద్ధికి సమ్మిట్ మరింత తోడ్పడుతుందని పేర్కొన్నారు. ఈ నెల 8, 9వ తేదీల్లో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ నిర్వహించనున్నందుకు... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోనియాగాంధీ అభినందనలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం చేస్తున్న కృషి విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. సదస్సులో పాల్గొననున్న వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

# ఆలయ డబ్బును బ్యాంకుల మనుగడకు వాడొద్దు : సుప్రీంకోర్టు

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ వ్యాఖ్యలు చేసింది. సహకార బ్యాంకులకు ఆదాయ వనరుగా లేదా అవి మనుగడ సాగించేందుకు ఆలయ నిధులు ఉపయోగించొద్దని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. కేరళలోని తిరునెల్లి దేవస్థానం చేసిన ఫిక్స్‌డ్ డిపాజిట్లను తిరిగి చెల్లించాలని కేరళ హైకోర్టు గతంలో ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ మనాంతవాడి కో-ఆపరేటివ్ అర్బన్ సొసైటీ లిమిటెడ్, తిరునెల్లి సర్వీస్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ సహా కొన్ని సహకార బ్యాంకులు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌ను విచారిస్తూ న్యాయస్థానం పైవ్యాఖ్యలు చేసింది. ఈ సందర్భంగా.. "మీరు ఆలయ డబ్బును ఉపయోగించి బ్యాంకును రక్షించాలనుకుంటున్నారా? కష్టాల్లో ఉన్న ఒక సహకార బ్యాంకులో డబ్బు ఉంచే బదులు, ఎక్కువ వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకుకు ఆ నిధులను మార్చాలని ఆదేశించడంలో తప్పేముంది?" అని జస్టిస్ సూర్యకాంత్ ప్రశ్నించారు. హైకోర్టు ఇచ్చిన ఆదేశాల వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని బ్యాంకుల తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఆ వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. "మీరు ప్రజల్లో విశ్వసనీయత పెంచుకోవాలి. కస్టమర్లను, డిపాజిట్లను ఆకర్షించలేకపోతే అది మీ సమస్య" అని ఘాటుగా వ్యాఖ్యానించింది. దేవుడి డబ్బును తిరిగి చెల్లించడానికి సమయం పొడిగించాలని కోరుతూ మాత్రమే కో-ఆపరేటివ్ బ్యాంకులు హైకోర్టును ఆశ్రయించడానికి సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ బ్యాంకుల పిటిషన్లను విచారించడానికి మాత్రం నిరాకరించింది. తిరునెల్లి దేవస్థానం ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసిన ఐదు సహకార బ్యాంకులు గడువు ముగిసినా, తిరిగి చెల్లించాలని పదేపదే అడిగినా.. డబ్బు ఇవ్వడానికి నిరాకరించాయి. దీంతో దేవస్థానం హైకోర్టును ఆశ్రయించింది. విచారణ తర్వాత రెండు నెలల్లోగా దేవస్థానం డిపాజిట్ మొత్తాన్ని తిరిగివ్వాలని బ్యాంకులను హైకోర్టు ఆదేశించింది.

# 'అఖండ-2' ఫైనాన్షియల్ ఇష్యూ..

(మొదటిపేజీ తరువాయి)

పాల్గొన్న సురేశ్ బాబు.. 'అఖండ 2' వాయిదా గురించి మాట్లాడారు. "నేను కూడా ఆ ఇష్యూని క్లియర్ చేయడానికి వెళ్లాను. అందుకే ఈ కార్యక్రమానికి రావడం ఆలస్యమైంది. త్వరలోనే అఖండ 2 సమస్య పరిష్కారమవుతుంది. అవి అన్నీ ఆర్థికపరమైన ఇబ్బందులు. బయటకు వెల్లడించకూడదు. దానికి సంబంధించిన ఆర్థిక వ్యవహారాల గురించి ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్లు రాస్తున్నారు. ఇది దురదృష్టకరం. ప్రతిఒక్కరూ "అఖండ 2' రిలీజ్ కాకపోవడానికి ఏవేవో కారణాలు చెబుతున్నారు. 'అన్ని కోట్లు చెల్లించాలట' అని రాస్తున్నారు. అవి అన్నీ అనవసరపు ప్రస్తావనలు. ఆడియన్స్ సినిమా ఎప్పుడు రిలీజ్ అవుతుందా అని ఎదురుచూస్తున్నారు. త్వరలోనే ఈ సమస్య పరిష్కారమై సినిమా విడుదలవుతుంది. గతంలోనూ చాలా సినిమాలకు ఇలాంటి ఇబ్బందులు వచ్చాయి" అని నిర్మాత సురేశ్ బాబు అన్నారు. బాలకృష్ణ – బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపొందిన తాజా చిత్రం 'అఖండ 2' వాయిదా పడిన విషయం తెలిసిందే. డిసెంబర్ 5న విడుదల కావాల్సిన ఈ చిత్రం కొన్ని అనివార్య కారణాల వల్ల చివరి నిమిషంలో వాయిదా పడింది.

# అంగీకరించగలరా..?

(మొదటిపేజీ తరువాయి)

అబద్ధాలు మాట్లాడితే ఊరుకోం. పరకామణి కేసులో చోరీ జరిగింది రూ.75 వేలే కదా అని జగన్ అంటున్నారు. రూ.75 వేలు అయితే దొంగతనం చేయవచ్చా?" అని సంధ్యారాణి నిలదీశారు.

## సన్నబియ్యం ద్వారా
# పేదల ఆకలి తీరుస్తున్నాం..

(మొదటిపేజీ తరువాయి)

విజయోత్సవాల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం వరంగల్ జిల్లాలో పర్యటించారు. రూ.532 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం నర్సంపేటలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. "వరంగల్ గడ్డకు చెందిన ఎందరో వీరులు తమ పరాక్రమాన్ని ప్రపంచానికి చూపారు. కాకతీయ యూనివర్సిటీ పోరాటాలు ఎప్పుడూ స్ఫూర్తినిస్తాయి. తెలంగాణ వస్తే.. సమస్యలు పరిష్కారం అవుతాయని ఈ జిల్లా ప్రజలు ఆశించారు. కుర్చీలో కూర్చున్న వారి ఆస్తులు పెరిగాయి కానీ, ప్రజల జీవితాలు మారలేదు. మీ ఓటునే ఆయుధంగా మార్చి.. గడీల పాలనను కూల్చారు. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తవుతోంది. వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్టే అని ఆనాటి సీఎం కేసీఆర్ అన్నారు. ఈ ప్రభుత్వం మాత్రం.. రైతు పండించిన చివరి గింజ వరకు కొంటోంది. కాంగ్రెస్ వస్తే.. కరెంట్ ఉండదని ఆనాటి సీఎం దుష్ప్రచారం చేశారు. రైతు బంధు బంద్ అవుతుందని ప్రజలను బెదిరించారు. కాంగ్రెస్ పవర్‌లోకి వచ్చాక.. రాష్ట్రాన్ని దోచుకున్న వారి పవర్ మాత్రమ్ కట్ అయ్యింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌పై పేటెంట్ హక్కు ఉన్నది కాంగ్రెస్‌కు మాత్రమే. గత సీజన్‌లో 9 రోజుల్లోనే రూ.9వేల కోట్లను రైతు భరోసా కింద ఇచ్చాం. ఈ దేశంలో వరి అత్యధికంగా పండిస్తున్న రాష్ట్రం తెలంగాణ మాత్రమే. సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం. గత ప్రభుత్వం పదేళ్లపాటు పేదలకు కొత్తగా ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదు. రాష్ట్రంలో 1.10 కోట్ల రేషన్ కార్డుల ద్వారా.. 3.10 కోట్ల మంది లబ్ధిదారులకు సన్నబియ్యం ఇస్తున్నాం. రేషన్ కార్డుల్లో కొత్తవారికి చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించాం. సన్నబియ్యం ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నాం" అని సీఎం అన్నారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శనివారం, 06 డిసెంబర్ 2025




www.viswamvoice.com

# ప్రపంచంతో పోటీ పడాలి

## చిన్నారులతో కలసి మధ్యాహ్న భోజనం చేసిన మంత్రి, జిల్లా కలెక్టర్



**అంగలకుదురు (గుంటూరు జిల్లా), విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచంతో పోటీ పడాలని విద్యార్థులకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం (మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ 3.0) జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఏర్పాటు చేసిన విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను అభినందించారు. టెక్నాలజీని ఉన్నతికి ఉపయోగపడే విధంగా విద్యార్థులు ఉపయోగించుకోవాలన్నారు. మీ చుట్టుప్రక్కల వాతావరణాన్ని గమనించండి... సమాజానికి ఉపయోగపడే అంశాలను స్వీకరించాలన్నారు. గ్రామానికి ఏ విధంగా ఉపయోగపడగలమో ఆలోచించాలని సూచించారు. ఇందుకు సమాజం బాధ్యత తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలలో చక్కటి వసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో తన పిల్లలను చదివిస్తున్న ఉపాధ్యాయునిని అభినందించారు. ఆత్మవిశ్వాసంతో సభలో మాట్లాడిన చిన్నారులను ప్రశంసించారు. ఒక విద్యార్థి సి.ఇ.ఓ కావాలి అనుకోవడంను అభినందించారు. పేదలకు సహకరించుటకు, విద్యార్థుల చదువుకు సహకరించుటకు సి.ఇ.ఓ కావాలని నిర్ణయించుకోవడం విద్యార్థి ముందు చూపును అభినందించారు. పాఠశాల అభివృద్ధి కోసం సమష్టిగా కృషి చేయాలని కోరారు. నెస్లీ కంపెనీ 20 బయో టాయిలెట్స్ ఇవ్వడాన్ని అభినందిస్తూ దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ కార్యక్రమాలు చేస్తుందన్నారు. సమాజంలో పారిశుధ్యం అవసరం అని, సురక్షిత తాగునీరు అందించాలని సూచించారు. ఎవరు చదువుకు దూరం కాకూడదని ప్రభుత్వ ఆదాయం అన్నారు. రాష్ట్రంలో రూ.46 వేల కోట్లు విద్య కోసం ఖర్చు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ప్రస్తుతం కృత్రిమ మేధ వచ్చిందని, ఇపుడు అనుకునే ఉద్యోగాలు తరువాత ఉండకపోవచ్చని, ఇతర రకాల ఉద్యోగాలు ఉండవచ్చు అని తెలిపారు. తరువాత చూస్తాం అనుకోకూడదని, భవిష్యత్తులో వచ్చే ఉద్యోగ అవకాశాలను ఇప్పుడే అంచనా వేయాలని సూచించారు. ఇప్పటి నుండే లక్ష్యం ఉండాలని, ప్రపంచంతో పోటీ పడాలని అన్నారు. భారతీయులు గణితం, సైన్స్ లలో అందెవేసిన చేయి అని అందుకే ప్రపంచంలో ప్రముఖ పెద్ద కంపెనీలకు సి.ఇ.ఓలుగా రాణిస్తున్నారని చెప్పారు. ఎదగాలని ఆలోచన చిన్న తనంలోనే ఉండాలని సూచించారు. వినూత్న ఆలోచనలు దిశగా ఆలోచించాలని చెప్పారు. విద్యలో కూడా డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ వస్తుందని మంత్రి చెప్పారు. ఎక్కువ మంది ప్రభుత్వ పాఠశాలలలో చదవాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలని పేర్కొంటూ ఉపాధ్యాయుడు లేనిదే ప్రపంచం లేదు.. విలువలు లేవు అన్నారు. ఉపాధ్యాయులను గౌరవించాల న్నారు. చిన్నారులు డ్రగ్స్ కు, బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని, పోలీస్ ఫోన్ నంబర్ల వంటి కనీస సమాచారం కలిగి ఉండాలని అన్నారు. రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంకు 3 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని అందిస్తున్నామని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంకు రైతాంగం ధాన్యంను అందించుటకు ముందుకు వచ్చిన రైతాంగానికి అభినందించారు. అంగలకుదురు ప్రాంత అభివృద్ధికి అందరూ సమష్టి కృషి అవసరం అన్నారు. జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ జిల్లాలో 1049 పాఠశాలలుతో సహా, జూనియర్ కళాశాలల్లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం జరుగుతుందన్నారు. చిన్నారుల చదువు, భావోద్వేగాలు, ఇతర అంశాల్లో రాణింపు వంటి అంశాలతో కూడిన సంపూర్ణ ప్రగతి నివేదిక ను ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఒక యాప్ ను అమలు చేయడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం నుండి అన్ని సదుపాయాలు కల్పించడంతో పాటు, మార్షల్ ఆర్ట్స్, ఎక్స్పోజర్ విసిట్ లు కూడా ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సంబంధాలు మెరుగు పడతాయన్నారు. విద్యార్థులకు భవిష్యత్తు లక్ష్యాలను తెలియజేయాలని అన్నారు. చిన్నారులకు పాఠ్యాంశాలతో పాటు ఇతర పుస్తకాలు చదవాలని కోరారు. బాల్య వివాహాలు వద్దని, ఉన్నత స్థాయికి చేరడమే లక్ష్యమని సూచించారు. తెనాలి సబ్ కలెక్టర్ సంజన సింహా మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల అభ్యసన ప్రక్రియను తెలుసుకోవాలని అన్నారు. విద్యార్థులను ఆకట్టుకోవడానికి ఉపాధ్యాయులు విభిన్న బోధనా పద్ధతులు వినియోగించుకోవాలని సూచించారు. చిన్నారుల్లో సృజనాత్మకత వెలికి తీయడం అవసరం అన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి సి.వి. రేణుక మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణలు వివరించారు. ప్రధాన ఉపాధ్యాయులు అనురాధ మాట్లాడుతూ పాఠశాల ప్రగతిని వివరించారు. పి.ఎం శ్రీ పాఠశాలగా ఉందని చెప్పారు. పదవ తరగతి పరీక్షలలో 92 శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. తల్లిదండ్రుల తరపున వసుంధర మాట్లాడుతూ ఉపాధ్యాయులు చిన్నారులను క్రమ శిక్షణతో విద్యను బోధిస్తున్నారని చెప్పారు. షేక్ రీహాన అనే జూనియర్ ఇంటర్ విద్యార్థి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్య ప్రవేశ పెట్టడం ఆనందదాయకం అన్నారు. జాతీయ స్థాయిలో పోటీలకు శిక్షణ ఇస్తున్నారని చెప్పారు. పాఠశాలలో నైతిక విలువలపై బోధిస్తున్న ఒక కథను 8వ తరగతి విద్యార్థి ఐశ్వర్య ఆత్మీయ సమావేశానికి హాజరైన అతిథులు, తల్లిదండ్రులకు వివరించారు. 3వ తరగతి చిన్నారి ఆంగ్లంలో మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు వివరించడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో చేరి వసతులు సద్వినియోగం చేసుకోవాలని, అనవసరంగా డబ్బు వృథా చేయరాదన్నారు. పాఠశాల విద్యార్థులు పాఠశాలలో నేర్పిస్తున్న మార్షల్ ఆర్ట్స్ ను ప్రదర్శించారు. పి.ఎం శ్రీ క్రింద రూ.15.58 లక్షలతో నిర్మించిన కెమిస్ట్రీ లాబ్ ను మంత్రి ప్రారంభించారు. చిన్నారులతో కలసి మధ్యాహ్న భోజనంను మంత్రి, జిల్లా కలెక్టర్, అధికారులు, ప్రజా ప్రతినిధులు చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉప విద్యా శాఖ అధికారి జి.శాంతకుమారి, సర్పంచ్ రామ లక్ష్మి, పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన రైతు నాగలింగం కుటుంబానికి

## అండగా ఉంటాం..

### మంత్రి అచ్చెన్నాయుడు హామీ

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనంతపురం జిల్లా పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన రైతు చిల్లా నాగలింగం అప్పుల బాధలను తట్టుకోలేక 04.12.2025 తేదీన పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమైన, బాధాకరమైన సంఘటన అని వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి హృదయపూర్వకంగా ప్రార్థిస్తున్నానని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. నాగలింగం తనకు ఉన్న సుమారు 83 సెంట్ల వ్యవసాయ భూమితో పాటు మరో 3 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని అరటి సాగు చేసేవారు. వ్యవసాయంతో పాటు, మండలంలోని ఇతర అరటి రైతుల నుండి పంటను కొనుగోలు చేసి బెంగళూరుకు ఎగుమతి చేసే ట్రేడింగ్ వ్యాపారంలో కూడా నిమగ్నమయ్యారు. అయితే 2021-2024 మధ్యకాలంలో అరటి పంటకు సరైన ధరలు పలకకపోవడం, ఎగుమతి చేసిన పంటకు చెల్లింపులు రాకపోవడంతో ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతింది. అప్పులకు పెరిగిన వడ్డీలు, ట్రేడింగ్ వ్యాపారం పూర్తిగా నష్టాల్లో పడటం వల్ల ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. కారణం ఏదైనా సరే, రైతన్నను ఆదుకోవడం మా కూటమి ప్రభుత్వ ప్రధాన కర్తవ్యం. రైతు నాగలింగం కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. అయితే, శవ రాజకీయాలకు అలవాటు పడిన వైసీపీ నాయకులు ఎన్నాళ్ళగానో పేరుకుపోయిన అప్పుల బాధలతో జరిగిన ఈ విషాద మరణాన్ని, అరటి పంటకు కిట్టుబాటు ధరలు రాకపోవడమే కారణమని వక్రీకరించి ప్రజల్లో అపార్థం కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి హేయమైన రాజకీయ ప్రయత్నాలు తీవ్రంగా ఖండించదగినవి, సిగ్గుచేటు చర్యలు అని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

మద్యం కేసులో నిందితులకు

## ఏసీబీ కోర్టులో ఎదురు దెబ్బ

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** మద్యం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. నిందితులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, వెంకటేశ్ నాయుడు, బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణలు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం.. ఇటీవల తీర్పు రిజర్వ్ చేసింది. ఇవాళ బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. చెవిరెడ్డి, వెంకటేశ్ నాయుడు విజయవాడ జిల్లా జైల్లో, బాలాజీ, నవీన్‌లు గుంటూరు జిల్లా జైల్లో జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్నారు.



సగటు ఆయుష్షు పెరిగింది...

## జపాన్‌దే అగ్ర తాంబూలం

మనిషి జీవన ప్రమాణం పెరిగింది. ఆయుర్దాయం కూడా ఇంకా పెరిగింది. ఒకనాటి తో పోలిస్తే ఇపుడు మరింత జీవితం దక్కుతోంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి కానీ మనిషి సగటు ఆయుర్దాయంలో గణనీయమైన ఈ పెరుగుదలలో భారత్ కి కూడా స్థానం ఉండడమే విశేషంగా చెప్పుకోవాలి. గత ఆరు దశాబ్దాల కాలాన్ని చూస్తే కనుక ప్రపంచంలో అన్ని దేశాల్లోనూ సగటు మనిషి ఆయుష్షు పెరిగింది అని నివేదికలు చెబుతున్నాయి.

**జపాన్ గ్రేట్ :**

జపాన్ లో ఎక్కువ కాలం జీవించే వారు ఉంటారని అందరికీ తెలిసిందే. ఇపుడు ప్రపంచ గణాంకాలు చూసినా జపాన్ దే అగ్ర స్థానంగా ఉంది. చైనా కూడా అమెరికాతో సమానంగా ఆయుష్షుని పెంచుకుంది. భారత్ విషయమే తీసుకుంటే అరవై ఏళ్ళ క్రితం సగటు భారతీయుడు జీవిత కాలం కేవలం 46 ఏళ్ళు మాత్రమే. కానీ ఇప్పుడు అది ఏకంగా 72 కి చేరింది. దాంతో భారత్ లో కూడా మనిషి జీవిత కాలం బాగానే ఉన్నట్లు అయింది.

**ఆధునిక వైద్యంతో పాటు :** గతంతో పోలిస్తే ఆధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. దాంతో పాటు జీవన ప్రమాణాలు కూడా బాగానే పెరిగాయి. వీటి వల్లనే ఆయుష్షు కూడా పెరిగింది అని నిపుణులు చెబుతున్నారు. మెరుగైన వైద్య సేవలు ఇపుడు లభ్యమవుతున్నాయి. అలగే పరిశుభ్రతతో కూడిన జీవితం గతానికి పోలిస్తే ఎక్కువగానే దక్కుతోంది. మరో వైపు చూస్తే ప్రపంచ సగటు ఆయుర్దాయం అరవై ఏళ్ళ క్రితం 51 ఏళ్ళు అయితే ఇపుడు అది కాస్తా 73.3గా ఉంది. కరోనా వంటి మహమ్మారి వచ్చి కొంత ఆయుష్షుని తగ్గించినా అది తాత్కాలికంగానే ఉంది. మళ్ళీ పూర్వం మాదిరిగానే మనిషి జీవిత కాలం పెరిగింది.

**గణాంకాలు చూస్తే కనుక :** ఇక ఐక్యరాజ్యసమితి జనాభా విభాగం గణాంకాల ప్రకారం చూస్తే కనుక అత్యధిక ఆయుర్దాయం కలిగిన దేశాల జాబితాలో జపాన్ అగ్రస్థానంలో ఉందని చెప్పాలి. అక్కడ 1960లోనే అక్కడ సగటు ఆయుష్షు 68 ఏళ్లుగా ఉంది. ఇక అది ఇపుడు ఏకంగా 84 ఏళ్లకు పెరిగింది. అదే విధంగా ఇటలీ వంటి యూరోపియన్ దేశాలలో చూస్తే సగటు ఆయుర్దాయం 83.7 ఏళ్లుగా ఉంది. ఇక్కడ మంచి ఆరోగ్యకరమైన సమ్రక్షణ వ్యవస్థలు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు. అలాగే అక్కడ ప్రజానీకం కూడా మంచి ఆహారం అలవాట్లను చేసుకున్నారని అంటున్నారు.

**అమెరికా తీరు అలా :** ప్రపంచ సగటు ఆయుష్షు అనేక దేశాలలో భారీ పెరుగుదలను చూపించగా అమెరికాలో మాత్రం అది నెమ్మదిగానే ఉంది అని గణాంకాలు చెబుతున్నాయి. అమెరికలో 1960లో సగటు వయసు 70 ఏళ్ళుగా ఉంది. అయితే ఇపుడు మరో ఎనిమిదేళ్ళు మాత్రమే పెరిగి అది 78.4 ఏళ్లకు చేరింది. ఆ దేశంలో ఉన్న ఆరోగ్య సమస్యలలో ఊబకాయం, ఆరోగ్య సంరక్షణ లో కొన్ని రకాలైన అసమానతలు వంటివి కారణాలుగా చెబుతున్నారు. ఇక పొరుగున ఉన్న చైనా దేశం అయితే సగటు ఆయుష్షు విషయంలో గణనీయమైన పురోగతిని సాధించింది. 1960లో చైనాలో సగటి ఆయుష్షు అయితే చాలా తక్కువగా 33 ఏళ్లుగా ఉంది. ఇక ఇపుడు అక్కడ సగటు ఆయుర్దాయం ఏకంగా 78 ఏళ్లకు పెరిగి అమెరికాతో సరిసమానం అయింది. అంటే అక్కడ హెల్త్ పట్ల తీసుకునే జాగ్రత్తలు ఇతర ఆహార అలవాట్లు సర్కార్ తీసుకునే నిర్ణయాలు అన్నీ కలిసి ఈ విధంగా ఉన్నాయని అంటున్నారు.

## జనసేనలోకి వెళ్తే కోల్డ్ స్టోరేజ్ ?

రాజకీయాల్లో ఎవరైనా ఎదగాలని అనుకుంటారు. ఆ ఎదుగుదలలో భాగంగానే పార్టీలు మారుతూ ఉంటారు. ఇలా వైసీపీ నుంచి చాలా మంది నేతలు ఆ పార్టీ ఏపీలో అధికారంలో నుంచి పోగానే వెంటనే జంప్ చేశారు. అలా సీనియర్ నేతల నుంచి అనేక మంది కూటమి పార్టీలలో చేరిపోయారు. జనసేనలో చేరిన వారిలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలుగా చేసిన వారు కూడా ఉన్నారు. ఒక విధంగా తమ జిల్లాలలో రాజకీయ చక్రం తిప్పిన వారు కూడా ఉన్నారు. అయితే ఎంతో రాజకీయ అనుభవం ఉండి ఎన్నో పెద్ద పదవులు చేసిన వారు కూడా జనసేనలోకి వెళ్ళాక అంతే గౌరవం హోదాలను ఆశించారు. కానీ బిగ్ ట్విస్ట్ ఏంటి అంటే వారు అనుకున్నది వేరే అయింది అని అంతర్మధనం చెందుతున్నారని ప్రచారం అయితే సాగుతోంది.



**లిస్ట్ ఇదే :**

వైసీపీలో ఒకనాడు ప్రకాశం జిల్లా లాంటి చోట తన పలుకుబడితో అన్నీ శాసించిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆ పార్టీ ఓటమి చెందాక జనసేనలోకి వెళ్ళారు. ఇపుడు ఆయన తగిన ప్రాధాన్యత లేదంటూ వేడి నిట్టూర్పులు విడుస్తున్నారు అని అంటున్నారు. అలాగే ఉమ్మడి క్రిష్ణా జిల్లాకు చెందిన మరో సీనియర్ నాయకుడు సామినేని ఉదయభాను పరిస్థితి కూడా అలాగే ఉంది అని అంటున్నారు. ఆయనను ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా చేసినా తనకు పార్టీలో పెద్దగా ప్రాముఖ్యత లేదని ఆవేదన చెందుతున్నారని అంటున్నారు.

**దొరలా ఉన్నా కూడా :** ఇక పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి తనకంటూ ఒక బలమైన స్థానాన్ని సాధించుకున్న మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు జనసేనలోకి వచ్చాక తన ప్లేస్ ఏంటో అర్థం కాక ఉన్నారని అంటున్నారు. నియోజకవర్గంలో ఫైవ్ మెన్ కమిటీని పార్టీ నియమించింది. అందులో పెండెం దొరబాబు ఒకరుగా మాత్రమే ఉన్నారని అంటున్నారు. ఇక పొన్నూరులో 2019 లో వైసీపీ తరఫున గెలిచిన కిలారు రోశయ్య జనసేనలో చేరినా ఆయనకు పొన్నూరు జనసేన ఇంచార్జి గా పదవి కూడా దక్కలేదని అంటున్నారు.

**స్పెషల్ కేటగిరీగా :** తాము రాజకీయంగా ఎంతో సీనియర్లమని, తాము పదవులు చేసి వచ్చిన వారిమని వీరంతా భావించి జనసేనలోకి వెళ్లారు, కానీ అక్కడ ప్రత్యేక ప్రాధాన్యతలు ఏవీ లేకపోగా పవన్ కళ్యాణ్ సైతం అసలు పెద్దగా పట్టించుకోవడం లేదని మధనపడుతున్నారని అంటున్నారు. దీంతో తాము ఎందుకు పార్టీ మారామని కూడా వీరు తమలో తామే ప్రశ్నించుకునే పరిస్థితి ఉందని అంటున్నారు.

**వైసీపీలోకి తిరిగి :** ఇవన్నీ పక్కన పెడితే వైసీపీలోకి తిరిగి వెళ్లాలని అనుకున్నా కూడా అదంతా ఈజీగా అయ్యేది కాదని అంటున్నారు. వైసీపీలో అధినాయకత్వం తీరు దానికి కారణం. ఒకసారి పార్టీ వీడిపోతే మళ్ళీ అక్కడ డోర్స్ అయితే తెరచుకోవు అని అంటున్నారు. మరో వైపు చేర్చుకున్నా అవకాశాలు అయితే దక్కేది ఉండదని అంటున్నారు. ఇక ఆత్మ గౌరవం అసలు సమస్య అని చెబుతున్నారు. తాముగా పార్టీని వీడి తిరిగి చేరితే అది తమకే ఇబ్బందిగా ఉంటుందని కూడా కలవరం చెందుతున్నారు అని అంటున్నారు.

**వారికి నో ఆప్షన్స్ :** మొత్తానికి చూస్తే ముందుకు వెళ్తే నుయ్యి వెనక్కి పోతే గొయ్యి అన్నట్లుగా వీరి రాజకీయం తయారు అయింది అని అంటున్నారు. ఏది ఏమైనా రాజకీయాల్లో లాంగ్ జంప్స్ చేసినా ఒక్కోసారి అవి సక్సెస్ కావు, పైగా కాళ్ళు కూడా విరగవచ్చు అని అంటున్నారు. అన్ని ఫిరాయింపులు ఇంపుగా ఉండవని సూపర్ హిట్ కావని వీరి గురించి ఆలోచిస్తే కనుక అర్థం అవుతుందని విశ్లేషణలు ఉన్నాయి. ఇక ఏపీలో చూస్తే రాజకీయం కూటమి వర్సెస్ వైసీపీగా ఫిక్స్ అయిన వేళ ఇలాంటి వారికి నో ఆప్షన్స్ అని అంటున్నారు. ఈ విషయం గుర్తెరిగిన చాలా మంది ఉన్న చోటనే సైలెంట్ గా ఉంటున్నారు అని కూడా గుర్తు చేస్తున్నారు. మరి ఏపీ రాజకీయాల్లో ఇదే సీన్ మును ముందు కనిపిస్తుందా లేక ఏమైనా మార్పులు ఉంటాయా అంటే చూడాల్సిందే.

# విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెందడమే లక్ష్యం

**విద్యార్థి సామర్థ్యం పై అంచనా కే పేరెంట్స్,టీచర్స్ మీట్ 3.0 - విద్యతో పాటు ఒకేషనల్ కోర్సుల ద్వారా జీవనోపాధికి బోధన**

**కుటుంబ శుభకార్యాల కంటే విలువైనది పేరెంట్,టీచర్స్ మీట్ - సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు ఎమ్మెల్యే వేగుళ్ళ హితవు**

**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన మెగా టీచర్స్, పేరెంట్స్ మీట్ 3.0 ద్వారా విద్యార్థుల ప్రగతి, పరిస్థితులపై ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించడమే ముఖ్య ఉద్దేశ్యమని మండపేట శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో హైస్కూల్ లో ప్రిన్సిపాల్ శాంతి సునీత అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తొలుత విద్యార్థుల స్వాగత నృత్యాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శాంతి సునీత మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలను వినియోగించుకుంటూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. పిఎం శ్రీ ఉత్తమ పాఠశాలగా, స్వచ్ఛ పాఠశాలగా జిల్లాలో ఎంపిక కావడం గర్వకారణమన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు ఒకేషనల్ కోర్సుల పై సైతం అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. అనంతరం పసలపూడి గ్రామానికి చెందిన బాక్సింగ్ కోచ్ ఎన్. గిరి వెంకటరమణ పర్యవేక్షణలో విద్యార్థులు ఆత్మ రక్షణ కళను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ పాఠశాల విడిచి పెట్టిన తరువాత ఆకతాయిల అల్లరి రహదారి పై ఎక్కువగా ఉందని పోలీసు వారి పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని కోరారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి. రామలక్ష్మణ మూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలని, శుభకార్యాల కంటే పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే ఇలాంటి కార్యక్రమాలలో తప్పకుండా పాల్గొనాలని ముఖ్యమంత్రి ఆశయం గొప్పదని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మండపేట శాసన సభ్యులు, రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ వేగుళ్ళ జోగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో పండుగ వాతావరణం చోటు చేసుకుందని అన్నారు విద్యార్థులు



ముఖ్యంగా టెక్నాలజీ తో సమయాన్ని దుర్వినియోగం చేసుకోకుండా, పుస్తక పఠనం ద్వారా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల ప్రగతి, పరిస్థితులపై విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించడమే కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని ఆయన వివరించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి పలు విషయాలను పరిశీలించారు. తల్లిదండ్రులు సైతం ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు, రాయవరం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవల్లి రాంబాబు, ఎమ్మార్వో బి.వి భాస్కర్, ఎంఈఓ వై సూర్యనారాయణ, రాయవరం ఎస్సై డి సురేష్ బాబు, పాఠశాల కోఆప్టెడ్ మెంబర్ పోతంశెట్టి శ్రీనివాస రెడ్డి , వెలగల భజన రెడ్డి, టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు కోట వెంకటరమణ, వల్లూరి శ్రీనివాస్ చౌదరి, ఐటిడిపి నాయకులు దొంతంశెట్టి బాల కేదారీశ్వరుడు, కె.ప్రసన్న, కె.సురేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

విలేఖరిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన

# ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి

## డీఎం అండ్ హెచ్‌వోకు ఫిర్యాదు



**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లవరం మండలం గోడిలంక పీహెచ్‌సీ నిర్వహణకు సంబందించి కాయకల్ప ప్రోగ్రాంలో అట్టడుగు స్థాయికి పడిపోయిందని దిశ పత్రికలో వచ్చిన కథనానంపై ఆ పీహెచ్‌సీలో సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న సాపే సత్యనారాయణ అనే వ్యక్తి ఆ పత్రిక విలేఖరిపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై డీఎం అండ్ హెచ్‌వో సీహెచ్ దుర్గారావు దొరకు విలేఖరులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై సంబందిత విలేఖరితోపాటు అల్లవరం మండల ప్రెస్‌క్లబ్ సభ్యులు సదరు ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని డీఎం అండ్ హెచ్‌వో ను కోరారు. గోడిలంక పీహెచ్‌సీలో ఇటీవల నిర్వహించిన కాయకల్ప ప్రోగ్రాంలో స్కోరు పడిపోయి అట్టడుగుస్థాయికి పడిపోయిందని దిశ పత్రికలో వచ్చిన కథనంతోపాటు ఇదే పీహెచ్‌సీలో కొత్తగా వచ్చిన వైద్యునిపై ఎప్పటినుంచో పాతుకుపోయిన కొంత మంది సిబ్బంది తప్పుడు ఫిర్యాదు చేస్తున్నారన్న విషయంపై ప్రజాసంఘాల నేతలు నిజనిర్ధారణకు వెళ్లిన క్రమంలో సూపర్ వైజర్ సత్యనారాయణ వార్త రాసిన విలేఖరిని ఎదవ అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశాడు.. దీనిపై సీపీఎం నాయకుడు కారెం వెంకటేశ్వరరావు, వీసీకే పార్టీ నాయకుడు శెట్టిబత్తుల తులసీరావు తీవ్ర అభ్యంతరం చెప్పి వారిస్తున్నప్పటికీ సదరు ఉద్యోగి తన బాధ్యత మరచి తీవ్ర వ్యాఖ్యలు చేశాడు. ఈ ఘటనకు సంబందించిన వీడియోను డీఎం అండ్ హెచ్‌వో కు సమర్పించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదరు సూపర్ వైజర్ సత్యనారాయణ కొత్తగా వచ్చిన డాక్టర్‌ను, కొంత మంది ఏఎన్‌ఎం లను కూడా వేధిస్తున్నట్లు కొంత మంది తమ వద్ద వాపోతున్నారని దీనిపై కూడా విచారణ చేపట్టాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో ఏపీఎంఫ్ జిల్లా అధ్యక్షుడు కె.సుధీర్, అల్లవరం ప్రెస్ క్లబ్ సభ్యులు గంటా అరుణ్‌బాబు, కట్టా మురళి, దంగేటి శ్రీనివాస్, ఎం. త్రీమూర్తులు, కె.రాజేంద్ర తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధనతో

# రాయవరం మునసబు ఆశయ సాధనకు కృషి చేయాలి

**తమ తండ్రి పేరు మీద ఏర్పాటుచేసిన ప్రాంగణం ఎందరో జీవితాలను వెలిగించింది**

**తెలిసి తెలియని యవ్వన ప్రాయంలో నడవడిక కాపాడుకోవాలి - మండపేట శాసన సభ్యులు వేగుళ్ళ**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలనందు మెగా పేరెంట్స్-టీచర్స్ మీట్ 3.0 ను కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామారావు అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, మండపేట శాసన సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రగతి పట్ల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యము అన్నారు. ఇంటర్మీడియట్ వయసు అన్నీ తెలుసు అనుకునే ఏమీ తెలియని ప్రాయమని, ఈ ప్రాయంలో మంచి నడవడిక, విద్యాభ్యాసం ద్వారా జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. స్థలధాత ఉండవల్లి సత్యనారాయణ మూర్తి, (రాయవరం మునసబు) విద్యాదాతగా తమ తండ్రి పేరు మీద ఏర్పాటుచేసిన ప్రాంగణం ఎందరో విద్యార్థుల జీవితాలను వెలిగించిందని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయడానికి విద్యార్థులు ప్రయత్నించాలని సూచించారు. అనంతరం కళాశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ను తిలకించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, తహసిల్దార్ బి.వి భాస్కర్, జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.రామలక్ష్మణ మూర్తి, ఎంఈఓ వై.సూర్యనారాయణ, రాయవరం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవల్లి రాంబాబు, తెదేపా సీనియర్ నాయకులు వల్లూరి శ్రీనివాస చౌదరి, జనసేన నాయకులు దేవిశెట్టి కోటేశ్వరరావు, బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులు దొంతంశెట్టి బాల కేదారీశ్వరుడు, కె వెంకట సురేష్, కె.ప్రసన్న కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

# విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలకు ప్రభుత్వం కృషి

**దురలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలను చేధించాలి - మెగా పేరెంట్స్ సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో అఖిల, వాసంశెట్టి సత్యం**



**రామచంద్రపురం, విశ్వంవాయిస్ న్యూస్ :** విద్యార్థులకు చదువుతోపాటు ఉన్నత విలువలు ముఖ్యమని, విద్యార్థుల ప్రవర్తన పై ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. రామచంద్రపురంలోని శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయోన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల హైస్కూల్, మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఇరువురు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో అఖిల మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థులు విలువలతో ప్రణాళిక బద్ధంగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు కూడా పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో విద్యార్థులు సోషల్ మీడియా, చెడు సహవాసాలు ద్వారా పెడదారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రవర్తనపై స్కూల్లో ఉపాధ్యాయులు, ఇంట్లో తల్లిదండ్రులు నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో బృహత్ సమావేశాలు(మెగా పిటిఎం) నిర్వహించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. చదువు ద్వారానే ఉన్నత స్థానాలకు ఎదగగలం అనే జీవిత సత్యాన్ని గుర్తించి విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్నారు. జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్య వ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఎస్ కే పి పి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు విద్యాసంస్థల్లో నిబంధనలు కఠిన తరం చేసి విద్యార్థుల ప్రవర్తన పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి లు మాట్లాడుతూ మెగా పేరెంట్స్ సమావేశాల ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థులు మధ్య సమన్వయం పెరిగి మంచి ఫలితాల సాధనకు దోహదపడతాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సూచనలు, సలహాలు తీసుకోవటం ద్వారా పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ టి వీర్రాఘవరెడ్డి, ఐ సి డి ఎస్ సిడిపిఓ వివి వరహాలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, మేడిశెట్టి శేషారావు, చందమామ వాసు, కంచుమర్తి బాబురావు, గొల్లపల్లి కృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగ శ్రీనివాస్ ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూసారం పెంచే ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

**మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ రమేష్**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** భూసారాన్ని పెంపొందించేందుకు భూసార పరీక్ష ప్రకారం రైతులు ఎరువులు వాడాలని మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ రమేష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం, పసలపూడి గ్రామంలో ప్రపంచ నేల దినోత్సవం, భూమాత రక్షణ దినోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కెవిన్ రమేష్ గారు మాట్లాడుతూ సూటి ఎరువులు, మిశ్రమ ఎరువులు వాడటంలో రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటల ద్వారా పురుగు మందుల అవశేషాలు తక్కువ ఉండి, ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. రైతులు కనీసం 10- 20 సెంట్లు భూమిలో ప్రకృతి వ్యవసాయం చేయాలని రైతులను కోరారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి గ్రామంలో భూమాత రక్షణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యాలను వివరించారు. నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఎరువులను వివేకవంతంగా ఉపయోగించమని రైతులను ప్రోత్సహించారు, గ్రామంలో అధిక ఎరువుల అమ్మకాలను పర్యవేక్షించడం, నకిలీ ఎరువులు లేదా దారి మళ్ళించిన వాటి గురించి సబ్-డివిజన్ జిల్లా కమిటీలకు తెలియజేయడం, సీజన్‌కు రెండుసార్లు సమావేశాలు నిర్వహించడం చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో పసలపూడి సొసైటీ చైర్మన్ సత్తి వెంకట కృష్ణారెడ్డి, గ్రామ రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రబీ 2025-26 సీజన్‌లో

# పంటలకు నీటి సరఫరా, వినియోగం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** జిల్లా కలెక్టరు, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం వారి అధ్యక్షతన రబీ 2025-26 సీజన్లో పంటలకు నీటి సరఫరా మరియు వినియోగం విషయమై జరిగిన సమావేశములో వారి ఆదేశముల ప్రకారం, 05.12.2025 (శుక్రవారం) తేది ఉదయం 10.00 గంటలకు రెవిన్యూ డివిజనల్ కార్యాలయం, కొత్తపేట నందు రబీ 2025-26 సీజన్లో పంటలకు నీటి సరఫరా మరియు వినియోగం విషయమై రెవిన్యూ డివిజనల్ అధికారి, కొత్తపేట వారి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడమైనది సదరు సమావేశమునకు కొత్తపేట రెవిన్యూ డివిజన్ పరిధిలో గల గోపాలపురం, అవిడి, గన్నవరం, అయినవిల్లి మరియు ఆలమూరు నీటి వినియోగదారుల సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు మరియు వీటి పరిధిలో గల నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, డివిజనల్ ఇంజనీర్లు (డ్రైన్స్), కొత్తపేట & పి. గన్నవరం, డివిజనల్ ఇంజనీర్లు (కెనాల్స్), కొత్తపేట & పి.గన్నవరం, కొత్తపేట డివిజన్ పరిధిలోని సహాయ ఇంజనీర్లు (డ్రైన్స్), సహాయ ఇంజనీర్లు (కెనాల్స్) హాజరు అయి ఉన్నారు. సదరు సమావేశములో పంట కాలువలపై సమస్యలు చర్చించడమైనది. మరియు ఇంజనీర్లు వద్ద నుండి అంచనా నివేదికలు తీసుకొని పై అధికారుల దృష్టికి తీసుకొని రాగలనని రెవెన్యు డివిజనల్ అధికారి, కొత్తపేట వారు హామీ ఇచ్చారని రెవిన్యూ డివిజనల్ కార్యాలయం కొత్తపేట వారు తెలియజేశారు.

తమ పిల్లలు ఏమి చదువుతున్నారో

# తల్లిదండ్రులకు తెలియడానికే మెగా పేరెంట్ మీటింగ్స్



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** భావి భారత సమాజం పాఠశాలల నుంచే రూపొందుతుంది కూటమి అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థలో సమూల ప్రక్షాళన కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వం భావిభారత సమాజం పాఠశాలల నుంచే రూపొందుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వ్యాఖ్యానించారు. కొత్తపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్స్ మీట్‌లో ఆయన పాల్గొన్నారు.పాఠశాలలో పాల్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఉపాధ్యాయులతో, విద్యార్థుల తల్లిదండ్రులతో, విద్యార్థులతో మాట్లాడారు. ఒక రైతు అయినా, ఒక పారిశ్రామికవేత్త అయినా, ఒక రాజకీయ నాయకుడు అయినా విద్యార్థుల నుంచే వస్తారన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యేనాటికి కొత్తపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పశువులు తిరుగుతూ ఉండేవని, అటువంటి పాఠశాలను అభివృద్ధిపథం లో నడిపామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు - నేడు పేరుతో కొన్ని పాఠశాలల్లో రంగుల మార్పు, అసంపూర్తి పనులతో వాటి భవిష్యత్తును గాలిలోకి నెట్టారని అన్నారు. ఉపాధ్యాయుల నియామ కాలు చేపట్టకుండా విద్యా వ్యవస్థకు ఇబ్బందులు కలిగించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో డబల్ ఇంజన్ సర్కార్ ప్రజల కోసం భావితరాల కోసం ఆలోచిస్తూ పనిచేస్తున్నాయన్నారు. మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టారని అన్నారు.యువ నాయకుడు నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా ఏరీ కోరి బాధ్యతలు తీసుకుని ఆ శాఖ అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని అభినందించారు. విద్యాశాఖ మంత్రిగా మంచి పేరు తెచ్చుకోవడం చాలా కష్టంగా గతంలో ఉండేదని అయితే తన పనితీరుతో అందరి ప్రశంసలు అందుకునేలా నారా లోకేష్ విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కార్పొరేట్ స్కూళ్లతో పోటీపడి ప్రభుత్వ పాఠశాలలు ముందుకు వెళ్లలేని పరిస్థితులు ఉన్నా విద్యావ్యవస్థను గాడిలో పెట్టి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన మంచి విద్యను అందజేస్తున్నారని ప్రశంసించారు. కార్పొరేట్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మంచి విద్య, నాణ్యమైన విద్య లభిస్తుందని అన్నారు. కార్పొరేట్ పాఠశాలలు పెద్ద పెద్ద బిల్డింగుల్లో ఉండవచ్చని అయితే ప్రభుత్వ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయుల ప్రతిభ కార్పొరేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు కన్నా అధికమన్నారు. గతంలో రెండు మెగా పేరెంట్ మీట్స్ నిర్వహించడం జరిగిందని ఇది మెగా పేరెంట్ మీట్ 3.0 అని అన్నారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారు? ఎలా ప్రవర్తిస్తున్నారు అనేది తల్లిదండ్రులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.అందుకోసం ఈ పేరెంట్ మీట్స్ అవసరమన్నారు. ఉపాధ్యాయుల్లో పోటీతత్వం పెరగడానికి ఎవరికి వారు తమ పాఠశాలల్లో విద్యార్థులకు కష్టపడి చదువు చెప్పి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలనే స్ఫూర్తిని అందివ్వడం కోసం ఈ మెగా పేరెంట్ మీట్స్ దోహదపడతాయని ఆయన అన్నారు. విద్యార్థులకు చట్టాల పట్ల, చట్ట సభల పట్ల, రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంచడానికి మాక్ అసెంబ్లీ కూడా పెట్టడం జరిగిందని, మన కొత్తపేట నియోజకవర్గం నుంచి స్టూడెంట్ ఎమ్మెల్యే ఒకరు ఎంపికై ఆ అసెంబ్లీకి వెళ్ళారని అన్నారు. తమ జీవితాన్నంతా సమాజం కోసం ధారపోసిన ఇటువంటి మహనీయుల పట్ల చిన్నారులకు అవగాహన కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. మన నియోజకవర్గంలో చింతలూరు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఉడతా వెంకటేశ్వరరావు మాస్టారు పాఠాలు బాగా చెబుతున్నారని తెలిసి నారా లోకేష్ ట్వీట్ చేసి అభినందించారని, మారుమూల ఉన్న పల్లెటూరులో ఒక ఉపాధ్యాయుడు బాగా పనిచేస్తున్నారని గుర్తించడం అంటే ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయ లోకానికి ప్రభుత్వం ఎంత గౌరవం ఇస్తుందో అర్థం చేసుకోవాలని, ఆ కోవలోకి అందరు ఉపాధ్యాయులు వెళ్ళాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల ప్రజాపరిషత్‌లో

# ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బండారు సత్యా నందరావు నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో ప్రజలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వినతులు సమర్పించారు. ప్రజలు తెలియజేసిన సమస్యలను ఓపికగా విన్నారు. సంబంధిత శాఖల అధికారులకు సదరు సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. సమస్యల పరిష్కారానికి రావులపాలెం క్యాంపు కార్యాలయం తో పాటు, ప్రతి మండల కేంద్రంలో ప్రజా దర్బార్ ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అధికారులు సైతం ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 238 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో అధికారులు మరియు కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



### శిలాఫలకాలపై కౌన్సిల్ సమావేశంలో

# ప్రశ్నించిన కో ఆప్షన్ రెడ్డి రాజబాబు


శిలా ఫలకాలా..? ప్రచార సాధనాలా..?
కాదేదీ ప్రచారానికి అనర్హం అనేట్టు గా కనబడుతున్న పరిస్థితి.. నిధుల వివరాలు సూచించే శిలా ఫలకాలే.. సంక్షేమ సూచీలు. మున్సిపల్ కమీషనర్ ను ప్రశ్నిస్తున్న పట్టణ



మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ : మండపేట మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధికి సూచికలైన శిలాఫలకాలను ప్రచార సాధనాలుగా మార్చిన తీరుపై విశ్వంవాయిస్ పత్రికలో 'శిలాఫలకాలా? ప్రచార సాధనాల?' అనే కథనం ప్రచురించడం అందరికీ విధేయతమే. దీనిపై మండపేట మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో కో ఆప్షన్, ఎక్సఫీషియో సభ్యులు కమిషనర్ తీరుపై అసహనం వ్యక్తపరిచారు. సమావేశంలో 29వ వార్డ్ కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ మండపేట పట్టణమంతా సుందరీకరణ జరుగుతుందని ప్రచారం చేసుకుంటున్నారు. మున్సిపల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న వైన్ షాప్ మార్గం పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందని ఇదేనా సుందరీకరణ అని ప్రశ్నించారు. అనంతరం కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు మాట్లాడుతూ గత పాలకులు చేసిన అభివృద్ధిని తెలుపుతూ అందుకు వెచ్చించిన బడ్జెట్ వివరాలు తెలిపే శిలాఫలకాలను పురపాలకసంఘ అధికారులు వాటిని ప్రచార సాధనాలుగా మార్చుకుంటున్నారని రాబోయే తరానికి అభివృద్ధి వివరాలను ఏ విధంగా తెలపాలని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే వేగుళ్ల మాట్లాడుతు అభివృద్ధికి సాక్షాలుగా ఉండే శిలాఫలకాలపై పురపాలక సంఘం వారు ప్రచార బోర్డులను అంటించడం ఎంతవరకు సమంజసం అని ఈ విషయం పై ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని కమీషనర్ టీవి.రంగా రావును ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ వెంటనే వాటిని తొలగించే ఏర్పాటు చేస్తామని తెలిపారు.

# కోనసీమలో కొబ్బరి రైతులను ఆదుకోండి..

### జిల్లాలో కోకోనట్ డెవలప్మెంట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటు చేయండి : ఎంపీ హరీష్ బాలయోగి



అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొబ్బరి రైతులను ఆదుకోవాలని పార్లమెంట్ వేదికగా కోరినట్లు అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యానవన వ్యవసాయ ఆర్థిక వ్యవస్థకు కొబ్బరిపంటలకు వెన్నెముక లాంటిదన్నారు. దేశంలో అత్యధిక కొబ్బరి దిగుబడి ఆంధ్రప్రదేశ్ ఇస్తుందన్నారు. అలాగే దేశ మొత్తం కొబ్బరి ఉత్పత్తి విలువలో 10 శాతం ఆంధ్ర రాష్ట్రం నుంచి వస్తోందని, అందులో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కొన్నసీమ జిల్లా ఆంధ్రప్రదేశ్‌లో ఉత్పత్తి అయ్యే కొబ్బరిలో 50 శాతం ఉందన్నారు.43,390 హెక్టార్ల విస్తీర్ణం నుంచి 6,942 లక్షల కొబ్బరికాయలు ఉత్పత్తి అవుతూ, దేశంలోనే అత్యంత ఫలప్రదత కలిగిన ప్రాంతంగా నిలిచిందన్నారు. కోనసీమలో కొబ్బరి కేవలం పంట మాత్రమే కాదని కుటుంబాలు, చిన్న పరిశ్రమలు, సంప్రదాయ జీవనోపాధిని నిలబెట్టే సాంస్కృతికి ఆర్థిక ఆధారమన్నారు.అయితే, ఈ ప్రాణాధార కొబ్బరి పంటలు ఇప్పుడు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోందని డెల్టా భూభాగం ఉప్పునీటి శాతం పెరిగటంతో భూగర్భజలాల మార్పులు కలిసి తోటల్లో చెట్ల తలలు విరిగిపోవడం, ఆస్మాటిక్ ఒత్తిడి, ఆకులు ఎండిపోవడం, పసుపు పచ్చగా మారడం, ముందుగానే రెమ్మలు ఊడిపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. వేసవి నెలల్లో సరైన డ్రైనేజ్ లేకపోవడంతో ఉప్పునీరు కొబ్బరి పంటల తోటల్లోకి చేరి, 2019 నుండి నేటి వరకు నిరంతర ఉప్పు శాతం కొనసాగుతోందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు రివిట్మెంట్ పనులు ప్రారంభించినప్పటికీ, సంవత్సరాల తరబడి అవి పూర్తికాలేదని, తాజాగా రాష్ట్ర ప్రభుత్వం 22 కోట్లు మిగిలిన పనుల కోసం మంజూరు చేసినప్పటికీ, అప్పటికే మట్టినాణ్యత తీవ్రమైనదిగా మారిందన్నారు. ఉప్పు శాతం నుండి భూమి పూర్వస్థితికి రావడానికి మరో రెండు నుండి మూడు సంవత్సరాల కాలం పడుతుందన్నారు. ఆ తరువాతే తిరిగి కొబ్బరి మొక్కలు నాటడం సాధ్యమవుతుందన్నారు. దీని వల్ల కొబ్బరి రైతులకు భారీ నష్టాలు ఏర్పడ్డాయని, ఈ సమస్య వల్ల 2019 నుండి ఇప్పటి వరకు 150 హెక్టార్లలోని 40 ఏళ్ల వయసున్న కొబ్బరి చెట్లు దెబ్బతిన్నాయని తెలిపారు. అలాగే 650 హెక్టార్లలో ఒక లక్ష కంటే ఎక్కువ కొబ్బరి చెట్లు చనిపోయాయి దిగుబడి రావడంలేదన్నారు. వాతావరణ మార్పులు, తుపాన్లు, వరదల కారణంగా మట్టిచరియలు, ఉప్పునీటి ప్రవేశం వంటి సమస్యలను మరింత పెంచాయన్నారు. మట్టిసార శక్తి తగ్గిపోవడం, ఒక్క పంట వైపే ఆధారపడటం, మంచి నాణ్యమైన నిరోధక రకాల కొరత ఇవన్నీ రైతుల ఇబ్బందులను మరింత గురిచేసాయన్నారు. విత్తనాలు, ఎరువులు, నీరు, పనివారి ఖర్చులు పెరిగిపోతుండగా, లాభాలు పడిపోతుండటం వల్ల రైతులు కొబ్బరి సాగును వదిలే దశకు చేరుకున్నారన్నారు. జిల్లాకు వచ్చిన నష్ట పరిమాణం కూడా ఎన్నడూ లేనంతగా పెరుగుతోందన్నారు. డెల్టా ప్రాంతానికి ఉన్న ప్రత్యేక సమస్యల పరిష్కారానికి స్థానికంగా కోకోనట్ డెవలప్మెంట్ బోర్డ్ కార్యాలయం లేకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమస్యలను ముందుగానే గుర్తించడం, సకాలంలో సాంకేతిక సహాయం ఇవ్వడం, నివారణ చర్యలు చేపట్టడం వంటివి ఆలస్యమారుతుందన్నారు. వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించే, సమన్వయం చేసే, త్వరిత స్పందన ఇస్తున్న ప్రాంతీయ కార్యాలయం ఉంటే పరిస్థితి వేరుగా ఉండేదని అందువల్ల, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిత్వ శాఖ దృష్టి సారించి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కొన్నసీమ జిల్లాలో ఒక ప్రత్యేక కోకోనట్ డెవలప్మెంట్ బోర్డ్ రీజినల్ ఆఫీస్ లేదా రాష్ట్ర సెంటర్ ఏర్పాటు చేయాలని కోరినట్లు చెప్పారు. తద్వారా రైతులకు మేలు జరుగుతుందని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

### జిల్లాలోని జాతీయ రహదారుల

# అభివృద్ధికి సహకరించండి : ఎంపీ హరీష్



అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని జాతీయ రహదారుల అభివృద్ధికి సహకరించాలని కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి కోరారు. ఢిల్లీలోని గడ్కరీ కార్యాలయంలో కలసి జిల్లాలోని ప్రయాణికులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లానన్నారు. రావులపాలెం నుంచి అమలాపురం వరకు నూతనంగా నిర్మించ తలపెట్టిన జాతీయ రహదారి రూపకల్పన పనులను వేగవంతం చేయాలని కోరినట్లు తెలిపారు. అలాగే యానాం – సుకరపాలెం వద్ద జాతీయ రహదారిలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో స్థానికులు, ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించాలని కోరారన్నారు. 216 ఏ జాతీయ రహదారిలో జొన్నాడ, ఇతర ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ బ్రిడ్జిల నిర్మాణ పురోగతిని వేగవంతం చేయాలని మంత్రి గడ్కరీని కోరినట్లు ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి కలిసిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వెలగపూడి ముఖ్యమంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తపేట ప్రభుత్వాసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఆత్రేయపురం మండలం ఉచ్చిలి, వసంతవాడ పంపింగ్ స్కీములు పునరుద్ధరణ, మరమ్మత్తులకు నిధులు కేటాయించాలని కోరారు. నియోజకవర్గంలో పేదల వైద్య ఖర్చులు కోసం సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు నిమిత్తం దరఖాస్తులను అందజేశారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే బండారు తెలిపారు.

### బిషప్ డయాసిస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో

# ఘనంగా దైవజనుల క్రిస్మస్







అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ : బిషప్ డయాసిస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో దైవజనుల క్రిస్మస్ ఆరాధన స్థానిక కల్వరి క్రైస్తవ ప్రార్థనా మందిరంలో శుక్రవారం సిపిహెచ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ జె. జార్జి పాపవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిషప్ డయాసిస్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ యలమంచిలి ప్రవీణ్ పాల్గొని పాస్టర్లకు క్రిస్మస్ సందేశం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు క్రిస్మస్ అనేది ఒక పండుగ మాత్రమే కాదు దేవుని ప్రేమ మనుష్యుల్లో నివసించడానికి వచ్చిన ప్రేమ, సంతోషం, సమాధానం, దయాళత్వం, సాత్వికం, శాంతి, క్షమ గుణం ప్రతి ఒక్కరూ కలిగి ఉండాలని అన్నారు. మన చుట్టూ ఉన్నవారికి సేవ చేస్తూ, సమాజానికి శాంతి సందేశం చేరవేస్తేనే క్రిస్మస్ నిజమైన అర్థాన్ని చూపినట్లవుతుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిల్ పాల్, డాక్టర్ జాన్ పాల్, యు.భాస్కరరావు, ఎల్ జోసెఫ్, ఎస్.ఇమ్మానుయేల్, వై.పరంజ్యోతి, పాస్టర్ జల్లి ఇమ్మానుయేల్, పాస్టర్ రొక్కాల జోసెఫ్, డాక్టరు జాన్ మోజెస్, నున్నా ప్రభు కుమార్, జె.విక్టర్ కుమార్, పాస్టర్ యాకోబు, అంబాజీపేట మండలం పాస్టర్లు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చదువుతోపాటు విలువలు ముఖ్యం

### విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలి - విద్యా వ్యవస్థలో పలు సంస్కరణలు తెచ్చిన మంత్రి నారా లోకేష్

### మెగా పేరెంట్స్ సమావేశంలో ఆర్డీవో అఖిల, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ : విద్యార్థులకు చదువుతోపాటు విలువలు ముఖ్యమని, వారి ప్రవర్తన పై ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రామచంద్రపురం ఆర్డీవో దేవరకొండ అఖిల, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. రామచంద్రపురంలోని శ్రీ కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయోన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల హైస్కూల్, మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ స్కూల్లోనూ శుక్రవారం జరిగిన ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఇరువురు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్డీవో అఖిల మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థులు విలువలతో ప్రణాళిక బద్ధంగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. ఉపాధ్యాయులకు తల్లిదండ్రులు కూడా పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ నేటి ఆధునిక సమాజంలో విద్యార్థులు సోషల్ మీడియా, చెడు సహవాసాలు ద్వారా పెడ దారి పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రవర్తనపై స్కూల్లో ఉపాధ్యాయులు, ఇంట్లో తల్లిదండ్రులు నిత్యం గమనిస్తూ ఉండాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో బృహత్ సమావేశాలు(మెగా పిటిఎం) నిర్వహించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. చదువు ద్వారానే ఉన్నత స్థానాలకు ఎదగగలం అనే జీవిత సత్యాన్ని గుర్తించి విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్నారు. జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ విద్య వ్యవస్థలో పలు సంస్కరణలు తీసుకొచ్చారన్నారు. ఎస్కేపిపి ట్రస్ట్ చైర్మన్ సలాది నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాల మేరకు విద్యాసంస్థల్లో నిబంధనలు కఠినతరం చేసి విద్యార్థుల ప్రవర్తన పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి లు మాట్లాడుతూ మెగా పేరెంట్స్ సమావేశాల ద్వారా ఉపాధ్యాయులు, విద్యార్థులు మధ్య సమన్వయం పెరిగి మంచి ఫలితాల సాధనకు దోహదపడతాయన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల సూచనలు, సలహాలు తీసుకోవటం ద్వారా పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ టి వీర్రాఘవరెడ్డి, ఐసిడిఎస్ సిడిపిఓ వివి వరహాలక్ష్మి, మాజీ మున్సిపల్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ, మేడిశెట్టి శేషారావు, చందమామ వాసు, కంచుమర్తి బాబురావు, గొల్లపల్లి కృష్ణ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నాగ శ్రీనివాస్ ,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గాడితప్పిన గోడిలంక పీహెచ్‌సీ..!

### స్థానిక ఉద్యోగుల పెత్తనంతో ఇబ్బందులు పాలు..?

### పనిచేయరు.. చేసేవాళ్లను చేయనీయరన్న చందంగా రాజకీయాలు.. - పడకేస్తున్న ప్రజారోగ్యం..




అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ : ఒకప్పుడు సమర్థవంతమైన వైద్యసేవలలో కళకళలాడే గోడిలంక పీహెచ్‌సీ పూర్తిగా గాడితప్పింది.. అంకిత భావంతో పనిచేద్దామని అనుకుంటున్నవారికి స్థానికత పేరుతో పెత్తనం చేస్తున్న కొంతమంది తప్పుడు ఫిర్యాదులతో మొత్తం అభాసుపాలవుతోంది... ఈనేపథ్యంలోనే ఇటీవలే ఈ పీహెచ్‌సీకు కొత్తగా వచ్చిన వైద్యుడిపై కొంత మంది రెచ్చగొట్టి తప్పుడు ఫిర్యాదు చేయడంతో ఈ పీహెచ్‌సీ మరింత రచ్చకెక్కింది.. విచిత్రం ఏంటంటే ఉన్నతాధికారులు పీహెచ్‌సీలో అసలు సమస్య ఎక్కడుందో నిగ్గు తేల్చి అసలు లిటికెంట్లుపై చర్యలు తీసుకోవాల్సింది పోయి కష్టపడి పనిచేస్తున్నవారినే లక్ష్యంగా పెట్టుకోవడంపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

**అసలు సమస్య ఎక్కడంటే...**

గోడిలంక పీహెచ్‌సీకు ఇటీవలే కొత్తగా అదనపు వైద్యాధికారిని నియమించింది.. కొంత మంది స్థానిక ఉద్యోగులు ఆడిందే ఆటగా సాగిన క్రమంలో ఆ వైద్యాధికారి ప్రతీ విషయంలోనూ ప్రశ్నించడం, కాలం చెల్లిన మందులు ఇంకా వారి వద్దనే ఉంచడం, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంపై ప్రశ్నించిన క్రమంలో కక్షకట్టి తమను వేధిస్తున్నాడంటూ కొందరిని రెచ్చగొట్టి అతనిపై తప్పుడు ఫిర్యాదులు చేయించినట్లు తెలుస్తోంది.. ఇటీవలే ఆసుపత్రిని పరిశీలించిన సీపీఎం, వీసీకే పార్టీ నేతలకు ఇదే అవగతం అయినట్లు సమాచారం. ఈక్రమంలోనే వారిపైనా చిందులేసిన స్థానికుడైన ఓ ఉద్యోగి ఈ తంతుపై కథనాలు రాసిన పత్రికా విలేఖరులను కూడా దూషిస్తూ వ్యాఖ్యలు చేయడం కనిపించింది. మొత్తం మీద గోడిలంక పీహెచ్‌సీలో రాజకీయం రచ్చకెక్కుతోన్న పరిస్థితిలో అసలు లక్ష్యమైన ప్రజా ఆరోగ్య సేవలు నీరుగారుస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి..

**కాయకల్పలో దిగువకు పడిపోయిన గోడిలంక పీహెచ్‌సీ స్కోరు..**

ఇటీవలే కాయకల్ప ప్రోగ్రాంలో భాగంగా గోడిలంక పీహెచ్‌సీని డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజ్ మెంట్ ఆఫీసర్ టీకే శ్రీనివాస్ పరిశీలించారు. కాయకల్ప ప్రోగ్రాంలో భాగంగా ఉండాల్సిన పరిస్థితులకు అనుగుణంగా ఒక్కటంటే ఒక్క విభాగాల్లో లేకపోవడంతో మొత్తం దిగువ స్థాయికి పడిపోయినట్లు తెలిసింది. ఆసుపత్రి అపరిశుభ్ర వాతావరణంలో ఉండగా బయో మెడికల్ వేస్టేజ్ నిర్వహణ అధ్వాన్నంగా ఉందని తేలింది.. ఆసుపత్రిలోపల ఇన్ఫెక్షన్ కంట్రోల్ స్టాండర్డ్స్ మరీ దారుణంగా ఉన్నట్లు తెలుస్తోంది.. ఆసుపత్రి ప్రాంగణంలో హెర్బల్ గార్డెన్ ఉండాల్సి ఉండగా పిచ్చి మొక్కలుతో నిండిపోయింది.. ఇలా ఆసుపత్రి నిర్వహణ అత్యంత అధ్వన్నంగా మారడంతో చెక్ లిస్ట్ మొత్తం అన్ని విభాగాల్లోనూ ఆసుపత్రి స్కోర్ జీరో స్థాయికి పడిపోయి ప్రోత్సహకంగా రావాల్సిన రూ.లక్ష దూరమయ్యింది.. పక్కనే ఉన్న బెండమూర్లంక పీహెచ్‌సీ ఇదే ప్రోగ్రాంలో మంచి స్కోరును సాధించడం కనిపించింది.. దీనిపై డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజ్ మెంట్ ఆఫీసర్ టీకే శ్రీనివాస్ కాయకల్పలో గోడిలంక పీహెచ్‌సీ స్కోర్ పడిపోయి ప్రోత్సహకం దూరమై నట్లు తెలిపారు. ఇలా మొత్తం మీద గోడిలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పనితీరు ఇలా మారడంతో స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.. ఉన్నతాధికారులు ఇప్పటికైనా దీనిపై దృష్టిపెట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేస్తున్నారు.



### సంక్రాంతి సంబరాల పనుల ఏర్పాట్లను

# పరిశీలించిన ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ : రాబోయే జనవరి నెలలో సంక్రాంతి పండుగల రెట్టింపు సందడి(ఉత్సాహం) వచ్చేలా సురసేనయానం బీచ్ లో నిర్వహించే సంక్రాంతి సంబరాల పనుల ఏర్పాట్లను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పరిశీలించారు. బీచ్ లో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమం లో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, యువ నాయకులు అయితాబత్తుల రత్న కరణ్, సాధనాల ఆదిశేషు, లంకే భీమరాజు, అయితాబత్తుల రాజశేఖర్ తదితరులు ఉన్నారు.



# రాష్ట్ర స్థాయిలో విద్యా ప్రగతిని నిరూపించుకోవాలి

## ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిలుపు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర విద్యా రంగంలో వినూత్నమైన సంస్కరణలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నదని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా రంగంలో వినూత్నమైన పాలనా సంస్కరణలను మంత్రి నారా లోకేష్ అమలు చేస్తున్నారు. తల్లికి వందనం పథకంలో విద్యార్థుకు రూ. 15,000 అందిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం పథకం, విద్యా మిత్ర కిట్లు బ్యాగులు, పుస్తకాలు, యూనిఫామ్‌లు, వసతి సౌకర్యాలను కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అందరూ మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వారి ప్రతిభా పాటవాలను నిరూపించుకోవాలని ఆమె విద్యార్థులకు పిలుపును ఇచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష పథకంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్) కార్యక్రమానికి ఎమ్మెల్యే సత్యప్రభ ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా బహిరంగ సభలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. ఆధునిక విద్యా, విధ్యార్ధి సౌకర్యాల కల్పనతో, విద్యా భోధనతో ప్రైవేటు విద్యా రంగానికి ధీటుగా ప్రభుత్వ విద్యా రంగం నిరంతరం పోటీ పడుతోందని ఎమ్మెల్యే మారుమూల పల్లెటూరి ప్రభుత్వ పాఠశాలలు సైతం పట్టణాల్లోని ప్రైవేటు విద్యా సంస్థలకు తీసిపోని విధంగా నాణ్యమైన విద్య, సౌకర్యాలను అందిస్తూ పోటీపడు తున్నాయని ఆమె వివరించారు. మారు మూల పల్లెల్లో చదువు కుంటున్నారు అని ఎవరైనా చిన్న చూపు చూడ్డానికి వీలులేని విధంగా చక్కటి కార్యక్రమాలను నిర్వహించారు అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల మధ్య సత్సం బంధాలు ఏర్పడి, పిల్లల విద్యా ప్రగతిపై మరింత స్పష్టత లభిస్తుంది అన్నారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, ఉపాధ్యాయుల బోధనా విధానాలు, పిల్లల విద్యార్జన స్థాయి, విద్యార్థుల పురోగతిని గురించి ప్రోగ్రెస్ కార్డులు, అసెస్మెంట్ బుక్‌లెట్‌లు, ఇలాంటి సమావేశాల ద్వారా తల్లి, దండ్రులు తెలుసుకోవచ్చని వివరించారు. అనంతరం పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేసిన ఎమ్మెల్యే వారితో కొద్దిసేపు పిచ్చాపాటీగా ముచ్చటిస్తూ గడిపారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఏలేశ్వరం మండలాధీశుడు గొల్లపల్లి నరసింహం (బుజ్జి) తన సొమ్ములతో కొనుగోలుచేసి బహూకరించిన 30 జతల క్రీడా ఏకరూపతా దుస్తులను విద్యార్థులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థి విజేతలకు బహుమతులను ఎమ్మెల్యే బహూకరించారు. ఎమ్మెల్యే సత్యప్రభను పాఠశాల తరఫున ఉపాధ్యాయుల బృందం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం మండలాధీశుడు గొల్లపల్లి నరసింహం (బుజ్జి), జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్, కూటమి శ్రేణులు, ప్రముఖులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హిందీ అకడమిక్ కో-ఆర్డినేటర్‌కు దరఖాస్తు చేసుకోండి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న హిందీ భాష అకడమిక్ కోఆర్డినేటరు ఉద్యోగం భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి సూరిశెట్టి వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో ఆహ్వానించారు. హిందీ సబ్జెక్ట్ లో తాత్కాలిక ఉద్యోగం నియామకం ఆసక్తి కలిగి, అర్హులైన అభ్యర్థులకు గౌరవ వేతనం నెలకు రూ.12,500 చెల్లిస్తామని, 5వ తేదీ లోపున దరఖాస్తులను శంఖవరం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

# పోడు రైతులకు సాగు పట్టాలు ఇప్పించాలి

## ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం మండలం పరిమితడక గిరిజన రైతులకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు, శంఖవరం మండలం కొండ గౌరంపేట రైతులకు కొండపోడు పట్టాలను మంజూరు చేయించేందుకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నేరుగా నడుం బిగించారు. ఈ మేరకు ఆ రెండు గ్రామాల రైతులతో కలిసి వెళ్ళి వారి తరఫున కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ షగిలి సన్‌మోహన్‌ను కలిసి ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా పోడు వ్యవసాయం సాగిస్తున్న గిరిజనులకు ఇప్పటికీ భూ పట్టాలు లభించక పోవడం వల్ల అనేక సమస్యలు ఎదురు అవుతున్నాయని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. భూ హక్కులు లేనందున ప్రభుత్వం అందించే పథకాలు, రుణాలు, వ్యవసాయ రాయితీలు, సదుపాయాలు పొందడంలో గిరిజన రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గిరిజనుల జీవనోపాధి రక్షణ కోసం వీరికి తక్షణమే పట్టాలు జారీ చేయాలని కోరారు. కలెక్టర్ కార్యాలయానికి ఎమ్మెల్యే వెంట చేరుకున్న దాదాపు 200 మంది గిరిజనులతో కలెక్టర్ సన్‌మోహన్ ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను విన్నారు. గిరిజనుల సమస్యపై సానుకూలంగా స్పందించిన కారెక్టర్ వీలైనంత త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని, అర్హులకు పోడు పట్టాలను మంజూరు చేస్తామనీ హామీ ఇచ్చారు. సమస్యను పూర్తిగా పరిశీలించి, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం మండలాధీశుడు గొల్లపల్లి నరసింహం (బుజ్జి), రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు (శివ), పూర్వపు ఉభయ గోదావరి జిల్లాల తెలుగు దేశం పార్టీ పూర్వ ప్రచార కార్యదర్శి పర్వత సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### సిఆర్ఎంటిలకు వేతనాలు పెంచి..

# ఉద్యోగ భద్రత కల్పించాలి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శంఖవరం సిఆర్ఎంటి లకు వేతనాలు పెంచి, ఉద్యోగ భద్రత కల్పించాలి శంఖవరం తాహాసిల్దార్ అల్లాడి తాతారావుకి, శంఖవరం మండల విద్యాశాఖ అధికారులు ఎస్.వెంకటరమణ, టి.గోవింద్ లకు గురువారం సాయంత్రం వినతిపత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖలో క్లస్టర్ రిసోర్స్ మానిటరింగ్ టీచర్స్ (మొబైల్ టీచర్స్) ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కారం కావాలని కోరుతూ ఏపీ సిఆర్పి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ వినతి పత్రాలను సమర్పించారు. తాము ఎదుర్కొంటున్న అనేక సమస్యలు గురించి అధికారులకు వివరించారు. దానిలో భాగంగా 14 సంవత్సరాల నుండి పని చేస్తున్న సి.ఆర్.ఎమ్.టిలకు నిర్థిష్టమైన జాబ్ చార్టును రూపొందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, గడిచిన 5 సంవత్సరాల నుంచి పెరగని వేతనాలను పెంచాలని, ఏ క్లస్టర్ బి క్లస్టర్ అనే విధానం ఉందనీ, రాష్ట్ర వ్యాప్తంగా ఒక్క బి క్లస్టర్ లోనే 1,227 మంది ఉన్నారని, ఈ ఎ, బి రెండు విధానాలు కాకుండా ఒకే క్లస్టర్ గా లోకల్ ప్రాధాన్యతతో కొనసాగించాలని, టెట్, బిఎడ్ అర్హతలతో సి.ఆర్.ఎమ్.టిలు పని చేస్తున్నారనీ, అందువల్ల వీరికి డియస్సిలో వెయిటేజీ ఇవ్వాలని, ఇప్పటికే క్లస్టర్ ప్రధాన ఉపాధ్యాయులకు, 1, 2 ఎమ్ఈఓలకు సి.ఆర్.ఎమ్.టిలు జవాబుదారీగా ఉన్నారని, ఎవరో ఒకరి క్రింద పని చేసేలా నిర్థిష్టమైన జాబ్ చార్ట్ ఇప్పించాలని, సి.ఆర్.ఎమ్.టిల ఉద్యోగ విరమణ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, సి.ఆర్.ఎమ్.టిలకు ఎఫ్.ఎల్.ఎన్ సర్వే, ఆడిట్, ఓఎస్సి సర్వే, టీచ్ టూల్ సర్వే, ఇలా అనేక రకాల విధులను నిర్వహిస్తూ ఉన్నందున గతంలో అమలు చేసి, తర్వాత రద్దు చేసిన రవాణా బత్యం చెల్లింపు విధానాన్ని యధావిధిగా పునరుద్ధరించాలని, విధి నిర్వహణలో మరణించిన ఉపాధ్యాయులకు రూ. 10 లక్షలు నష్టపరిహారాన్ని చెల్లించాలని, ఆ కుటుంబీకుల్లో అర్హులైన ఒకరికి కారుణ్య నియామక ఉద్యోగం ఇవ్వాలని, ఈ మా డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్ళాలని కోరుతూ శంఖవరం మండలం తాసిల్దార్ అల్లాడి తాతారావుకి వివరించారు. తమ సమస్యలను పరిష్కరించకుంటే 8 వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద, 22 న విజయవాడలోనూ ధర్నా నిర్వహిస్తామని శ్రీముఖం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ.సి.ఆర్.ఎం.టీచర్స్ యునైటెడ్ ఫోరమ్ నాయకులు డి.రాజబాబు, ఎస్.నానిబాబు పాల్గొన్నారు.

### ఆరుగుళ్ల అప్పన్న బాబును

# పలకరించిన మురళి రాజు

## నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తున్న ఎం.ఎం.ఆర్ చారిటబుల్ అధినేత



**ప్రత్తిపాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో వైఎస్ ఆర్సిపి అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కార్యకర్తలతో కలిసి ప్రతి కుటుంబాన్ని పలకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకుంటూ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి, అంకితభావం తో ప్రాంతంతో పని లేకుండా ప్రతి ఒక్కరిని పలకరిస్తూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి తన వంతు సహాయం చేస్తూ అందరి ఆదరాభిమానాలు పొందుతున్న వైఎస్ఆర్సిపి నాయకులు నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు & ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ముదునూరి మురళి కృష్ణం రాజు గ్రామంలో ఆరుగుళ్ళ అప్పన్న బాబు కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధి తో బాధపడుతున్నారని తెలియడంతో అప్పన్న బాబును పరామర్శించి ఆరోగ్యం అడిగి తెలుసుకుని వారి కుటుంబానికి ఆర్థిక సహాయం 5000/- రూపాయలు అందజేసి ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ నానిపల్లి చంటి,బొల్లు నాగేశ్వరరావు, పోకనాటి వెంకటేశ్వరరావు, కాపారపు బుజ్జి, జడ్డ శ్రీను, వండ్రపు నాగరాజు, కాపారపు చిన్నబాబు,కాపారపు రాజు, దూలపల్లి బాజ్జి, కుటుంబ సభ్యులు, వైఎస్ఆర్సిపి నాయకులు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు

### 'మెగా పిటీఎం 3.0" కార్యక్రమానికి

# ముఖ్య అతిథులుగా రూరల్ ఎమ్మెల్యే పంతం



**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం కేంద్రమైన కరప నక్క సూర్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే "మెగా పిటీఎం 3.0" కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ విచ్చేసి మొక్కన నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మొదటగా విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను ఎమ్మెల్యే పరిశీలించి, వారి ప్రతిభను అభినందించారు. అనంతరం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులతో కలిసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదల పవన్ కళ్యాణ్ నేతృత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు ప్రైవేట్ పాఠశాల కంటే ఆధునిక మౌలిక సదుపాయాలు అందించడం ద్వారా పాఠశాలలను బలోపేతం చేస్తున్నారన్నారు. తానే తన సొంత ఖర్చులతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించి సమస్యలను పరిష్కరించేందుకు. విద్యార్థులు చదువుకు ఉపయోగపడే సలహాలు సూచనలు తల్లిదండ్రుల వద్ద నుంచి తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు., పంతం ఫౌండేషన్ మరియు ఇతర స్వచ్ఛంద సంస్థల సహాయంతో దివ్యాంగులకు అవసరమైన కృత్రిమ పరికరాలు అందిస్తామని హామీ ఇచ్చారు. స్కూలు అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించమని ఓపెన్‌గా కోరగా, కొందరు సమస్యలు తెలుపగ సంబంధిత అధికారులకు అవి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే పంతం నానాజీ విద్యార్థులతో, కూటమి నాయకులతో కలిసి మధ్యాహ్న భోజనం చ్జేశారు.. ఈ కార్యక్రమం లో కూటమి నాయకులు చిక్కాల రామచంద్ర రావు, కడలి ఈశ్వరి, చప్పిడి వెంకటేశ్వర రావు, పెంకే శ్రీనివాస్ బాబా, నూరుకుర్తి వెంకటేశ్వరరావు, రంభాల వెంకటేశ్వర రావు, పితాని లీల, ఎంపీడీఓ, మండల విద్యా శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, స్థానిక కూటమి నాయకులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

# విద్యార్థులు రేపటి సమాజపు వారధులు, సారధులు...!

## తెలుగు దేశం పార్టీ సీనియర్ నేత పర్వత సురేష్




**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నేటి విద్యార్థులే రేపటి సమాజపు వారధులు, సారధులని పూర్వపు తూర్పు గోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ పూర్వ ప్రచార కార్యదర్శి పర్వత సురేష్ పేర్కొన్నారు. తల్లి దండ్రుల కష్టం, త్యాగం, ఉపాధ్యాయుల విద్యాబోధనతో సుశిక్షితులైన నేటి విద్యార్థులే రేపు ప్రయోజకులై సమాజానికి మార్గనిర్దేశం చేస్తారనీ సురేష్ వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష పథకంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలో తల్లి దండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం (మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్) కార్యక్రమాలను శుక్రవారం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. దీనిలో భాగంగా శంఖవరంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ, జూనియర్ కళాశాల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల, జిల్లా ప్రజా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లోని కార్యక్రమాలకు సురేష్ ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈ సందర్భంగా సభల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి పర్వత సురేష్ ప్రసంగించారు. విద్యార్థులే ఈ సమాజపు భవిష్య నిధి అని, భవిష్య తరాలకు తరగని గనులని పేర్కొంటూ విద్యార్థులు అందరూ కూడా బాగా చదువుకుని తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు, మాలాంటి నేతల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిరూపంగా ప్రయోజకులుగా ఎదగాలని సురేష్ పిలుపును ఇచ్చారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలి. రక్త హీనతకు గురి కాకూడదు. విద్యార్థులు భావి వారసులు. మీ ద్వారా చక్కటి ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడాలి. అందువల్ల మీరు పౌష్టికాహారం తీసుకోవాలని సురేష్ సూచించారు. మీతో బాటు మీ తల్లిదండ్రులు, గ్రామాల్లో ఇరుగు పొరుగు వారి ఆరోగ్యానికి అవసరమైనపుడు మీరు వైద్య సలహాలను ఇవ్వగలగలిగే జాగరూకతతో ఉండాలి. వారికి మీ సేవలను అందించాలి. అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడుతుంది. అప్పుడే భావి తరాలకు మీరు వారధులు సారధులు అవుతారని పర్వత సురేష్ పునరుద్ఘాటించారు. పాఠశాలలు, వసతి గృహాల ఉపాధ్యాయులపై విద్యార్థుల తల్లిదండ్రులు అనుచిత వ్యాఖ్యలు, వ్యాజ్యాలకు దిగరాదనీ, ఉపాధ్యాయ బృందాలు మన పిల్లలకు మంచినే భోధిస్తారనీ, అది ఎంత వరకూ పిల్లలకు అబ్బిందో ఆరా తీసి తెలుసు కోవాలే తప్ప తగాదాలకు పోకూడదని సురేష్ హితవు పలికారు. ఉపాధ్యాయులు పాఠశాలల నుంచి ఏమీ పట్టుకు పోరనీ, విద్యార్థులు ప్రయోజకులైతే అదే వారి ఆస్తిగా పరిగణించి, విద్యార్థుల కీర్తి ప్రతిష్టలనే వారి వెంట తీసుకెళ్తారని, అంతకు మించి ఉపాధ్యాయుల్లో ఏ స్వార్థం ఉండదని సురేష్ ఒకింత ఉపాధ్యాయ పక్షపాతిగా మాట్లాడారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పదవీ బాధ్యతలు స్వీకరించాక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయకు చక్కటి భవనం, ప్రయోగశాలను మంజూరు చేయించారని గుర్తు చేస్తూ, ప్రస్తుతం విద్యాలయకు రాదారిని అడుగు తున్నారని, అందుకు ఏదో మంచి సందర్భంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలను తీసుకువచ్చి ఈ రాదారి నిర్మాణనికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని సురేష్ హామీని ఇచ్చారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయలో ఎం.ఈ.ఓ 2 టి.గోవింద్ విద్య ఉపయోగాలు, లైఫ్ స్కిల్స్ గురించి వివరించారు. విద్యార్థుల పురోగతి గురించి, హెూలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు, స్కూల్ ప్రోగ్రెస్ రిపోర్టు, అభ్యసన ఫలితాలు, ల్యాబ్, లైబ్రరీ, ఎస్.వి.ఆర్.ఎం. కిట్ల గురించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. బాల్య వివాహాల నిషేధం, చట్టాలు, వివాహ వయస్సు గురించి చైల్డ్ ప్రొటెక్షన్ డిపార్ట్మెంట్ అధికారిణి జె.విజయ వివరించారు. సైన్సు, మాథ్స్, లైబ్రరీ, ఒకేషనల్ ల్యాబులను తల్లి, దండ్రులు సందర్శించి సంతోషం వ్యక్తం చేసారు. సెల్ఫ్ డిఫెన్స్ ఆక్టివిటీలను వేదికపై విద్యార్థులతో చేయించారు. అన్ని విద్యా సంస్థల్లోనూ వివిధ అంశాల్లో విజేత విద్యార్థులకు జ్ఞాపికలు, బహుమతులను బహుకరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారులు, అతిధుల బృందం సభ్యులు అందరూ సామూహిక ఆత్మీయ విందును స్వీకరించారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ ప్రిన్సిపాల్ బీర బాలామణి కుమారి, పి.ఎం.సి కమిటీ వైస్ చైర్మన్ బందిలి ధనలక్ష్మి, మెంబర్స్, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎ.వీర్రాజు, పి.ఎంసి చైర్మన్ జి.లక్ష్మీజ్యోతి, వైస్ చైర్మన్ శివశంకర్, ఐసిడిఎస్. ఈఓ. బి.వెంకట రజనీ, తుని ఆత్మ ఉపాధ్యక్షుడు కరణం సుబ్రహ్మణ్యం, శంఖవరం మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గాబు సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

# మారిన ప్రభుత్వ బడి ముఖచిత్రం..

## కరపలో కదంతొక్కిన కూటమి నేతలు..



**కాకినాడ రూరల్, (కరప) విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ ఎమ్మెల్యే వంతం నానాజీ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని స్పష్టం చేశారు. కరప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరేంట్స్ టీచర్ మీట్ (పీటీఎం)లో ఆయనతోపాటు టీడీపీ కాకినాడ రూరల్ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పిటిసి నులుకుర్తి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత వైసీపీ పాలనలో అస్తవ్యస్తమైన విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు తమ ప్రభుత్వం పలు సంస్కరణలను తీసుకువచ్చిందని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు కేవలం మెరుగైన బోధనతో పాటు పోషకాహారాన్ని అందించే దిశగా విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చినట్లు తెలిపారు. ?ఈ సందర్భంగా, ఎమ్మెల్యే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ప్రత్యేకంగా సమావేశమై విద్యార్థుల ప్రగతిపై సమీక్షించారు. అనంతరం, పోటీ పరీక్షలు, ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా బహుమతులు, నగదు ప్రోత్సాహకాలు, సైకిళ్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. విద్యార్థులు వివిధ అంశాలను స్పృశిస్తూ ప్రదర్శించిన ఎగ్జిబిషన్ను ఆయన వీక్షించి అభినందించారు. అలాగే, స్థానిక భవిత కేంద్రంలో ఐఈఆర్టీ కె. స్వాతి ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంలో కూడా ఎమ్మెల్యే వంతం నానాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలతో అటపాటలాడి, ఆయా అంశాల్లో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు, చేయూత స్వచ్ఛంద సంస్థ అందించిన ఉపకరణాలను అందజేశారు. కార్యక్రమం ముగిసిన తర్వాత ఎమ్మెల్యే విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోనూ మెగా పీటీఎం కార్యక్రమాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు చిక్కాల రామచంద్రరావు, పెంకే శ్రీనివాసబాబా, చప్పిడి వెంకటేశ్వరరావు, రంబాల వెంకటేశ్వరరావు, దేవు వెంకన్న, మామిడాల వెంకటేష్, పబ్బినీడి వెంకటకృష్ణ, బండారు మురళి, ముద్రగడ రమేష్, భోగిరెడ్డి కొండబాబు, గంగాధర్, యాళ్ల పండు, మే%శీ%డు గోవిందు,ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, సత్యనారాయణ, ఆత్మ చైర్మన్ గొల్లపల్లి చంద్రశేఖర్, హెచ్ఎం రాజరాజేశ్వరి, ఎంపిడివో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



# రాజానగరం ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజనలో ముందుండాలి : బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గం ప్రధానమంత్రి సోలార్ రూఫ్ టాప్ పథకంలో ప్రథమ స్థానంలో నిలపడానికి అధికారులు అందరూ కృషి చేయాలని రాజానగరం నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. శుక్రవారం కోరుకొండ ఆదిత్య ఫంక్షన్ హాల్‌లో బత్తుల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి రూఫ్ టాప్ పథకంపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు గ్రీన్ ఎనర్జీ, క్లియర్ ఎనర్జీలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ప్రధానమంత్రి సోలార్ రూఫ్ టాప్ ఒకటే, విద్యుత్ కష్టాల నుంచి ప్రజలను గట్టెక్కించగలదన్నారు. పూర్తిస్థాయిలో బ్యాంకులో రుణాలు ఇస్తున్నాయని, సబ్సిడీ పోను మిగిలిన బకాయి నాలుగైదు ఏళ్ళు తీరిపోతుందన్నారు. 20 సంవత్సరాల పాటు అదనంగా విద్యుత్ పొందవచ్చు అన్నారు. ఈ విషయంలో బ్యాంక్ మేనేజర్లు పెద్ద మనసుతో సహకరించాలన్నారు. ఈ సందర్భంగా రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ దేశంలో గ్యాస్, బొగ్గు నిక్షేపాల నిలువలు కరువుతున్నాయని, దీంతో ఇతర దేశాలపై ఆధారపడవలసి వస్తుందని, ఈ విధానం వల్ల విద్యుత్ కష్టాలు తొలగి, మనకు ఉచిత విద్యుత్తు చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు తిలక్ కుమార్, నటరాజన్, ఎన్డీఏ నాయకులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగ కేశవరావు, అద్దాల శ్రీను, మేడిశెట్టి శివరాం, దూది కాంతారావు, రొంగల శ్రీనివాస్, అడపా వీరబాబు, ఎమ్మార్వోలు, ఎంపీడీవోలు, ఏపీఎంలు, వివిధ బ్యాంక్ మేనేజర్, విద్యుత్ శాఖ ఏఈలు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గాదరాడలో దుర్గమ్మ జాతరకు ఏర్పాట్లు పూర్తి : తోరాటి



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** కోరుకొండ మండలం గాదరాడలో ఏడవ తేదీ ఆదివారం దుర్గమ్మ జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ నిర్వాహకులు తోరాటి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం గాదరాడలో దుర్గమ్మ జాతర సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, విద్యుత్ దీపాలతో అలంకరించినట్లు తెలిపారు. యావన్మంది భక్తులు విచ్చేసి,అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని అమ్మవారి అనుగ్రహం పొందాలని తోరాటి శ్రీనివాస్ తెలిపారు.

# విద్యార్థులపై తలిదండ్రుల పాత్రే కీలకం

## తల్లి తండ్రుల ఆత్మీయ సమావేశం - ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టండి



**దేవిపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** తలిదండ్రుల సమావేశంలో కూటమి ప్రభుత్వం విద్యార్థుల కొరకు ప్రవేశ పెట్టిన పథకాలు అమోఘమని అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన దేవి పట్నం మండలం బాలుర, బాలికల ఎంపిపి పాఠశాలలు పోతుకొండ పాఠశాల యాజమాన్య కమిటి చైర్మెన్ కారం సీతారాముడు, ఎంఇవో వన్ త్రిమూర్తులు, ప్రధాన ఉపాధ్యాయులు తుర్రం రాంబాబు మరియు పాఠశాల విద్యార్థులు తల్లి,తండ్రులు సచివాలయం సిబ్బంది అధ్యక్షతన తలిదండ్రుల సమావేశం నిర్వహించారు. వీరి ఆధ్వర్యములో మా తెలుగు తల్లికి మల్లెపూ దండ గేయంతో కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సౌకర్యార్థం గత ప్రభుత్వం కంటే ప్రస్తుత కూటమి ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి పై ప్రత్యేకమైన శ్రద్ధ పెట్టేలా తగు శ్రద్ధ వహించేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అలాగే తమ పిల్లలపై తలిదండ్రులు కూడా పూర్తి పర్యవేక్షణతో ఉండాలని కోరారు. విద్యార్థులకు తల్లికి వందనం వర్తింప జేసిన ఘనత తమ ప్రభుత్వానిదే అని కొనియాడారు. గత జగన్ రెడ్డి ప్రభుత్వంలో కేవలం ఇంట్లో ఒక్క పిల్లాడికి మాత్రమే పథకం వర్తింపు జేస్తే మన ప్రభుత్వం ఎంత మంది పిల్లలు ఉన్నా వారికి తల్లికి వందనం అందించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల కొరకు నాణ్యమైన ఏక రూప దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగులు అందిస్తుందని అలాగే సీతారాం పాఠశాలలో కూడా ఎంఇవో 1 త్రిమూర్తులు, ప్రదానుపాధ్యులు కుంజము రామన్నదొర, ఊరి పెద్దలు పాఠశాల ఎస్ఎంసి నెంబర్లు సిద్ధ నారాయణ స్వామి పాల్గొన్నారు అలగే ఎంఇవో మాట్లాడుతూ వారికి అదనంగా కొన్ని రకాల సదుపాయాలు కల్పించి వారి ఉజ్వల భవిష్యత్తుకి దోహద పడుతుందని స్పష్టం చేసారు. గత ప్రభుత్వంలో తలిదండ్రుల సమావేశాలే కరువయ్యాయని ప్రస్తుత కూటమి ప్రభుత్వం రాష్ట్ర విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ గారి ఆధ్వర్యంలో చాలా మంచిగా ఇలాంటి సమావేశాలు పండుగ వాతావరణంలో ఏర్పాటు చేయటంతో పాటూ ఆయా పాఠశాల, కళాశాల, వసతి గృహల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయో వారే గుర్తించి పరిస్కారం కొరకు సూచనలు చేసే వెసలుబాటు కల్పించిన ఘనత కూటమిదే అన్నారు. అలాగే విద్యాలయాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టిలో పెడితే పరిస్కారం చేస్తానని హామీ ఇచ్చారు. విద్యావ్యవస్థ ద్వారా కలిగే జ్ఞానంతో పాటూ అన్ని రంగాల్లో జ్ఞానము సంపాదించాలన్నారు. ఆడపిల్లలు ఎలాగ ఉండాలన్న దానిపై వారిని చైతన్యం చేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా కలిగే నష్టాలపై క్షుణ్ణంగా వివరించారు. కాబట్టి అలాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఉపాధ్యాయులు ఖచ్చితంగా పిల్లల పురోభివృద్ధి పై ఎప్పటి కప్పుడు వారి తలిదండ్రులకు తెలియ జేయాలన్నారు. ప్రతీ విద్యార్థి యోగ క్షేమాలు పై నిత్యం పర్యవేక్షణ ఉండాలని సూచించారు. అలాగే మండలము లోనీ మిగతా పాఠశాలలో కొన్ని రకాల సమస్యలు ఉన్నట్లు ప్రాముఖ్యంగా త్రాగునీటి సమస్య ఉందన్నారు. నాణ్యమైన ఆహారం అందించాలని కోరారు. ఇంకా తన దృష్టిలో పలు సమస్యలు ఉన్నాయని అలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని యాజమాన్యానికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గొల్ల చంటిబాబు ఉపాధ్యక్షులు మరిచెట్టి బుజ్జిబాబు అధిక సంఖ్యలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తలిదండ్రులు పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వేళంగిలో మెగా పేరెంట్స్ 3.0 కార్యక్రమం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ కరప మండలం వేళంగి గ్రామం ఎస్సీ కాలనీలో ఉన్న మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల-1లో ఉపాధ్యాయురాలు తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. పాఠశాల ఉపాధ్యాయురాలు పి.గంగా భవాని మాట్లాడుతూ విద్య వ్యవస్థలో పెను మార్పులు తీసుకురావడానికి ప్రతి సంవత్సరం మెగా పేరెంట్స్ డే ఏర్పాటు చేసి విజయవంతంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకున్నారని, విద్యార్థులు అందరూ ఈ మౌలిక వసతులు ఉపయోగించుకుని మంచి విద్యను అభ్యాసించి మంచి ఉన్నత స్థితికి చేరుకోవాలని అన్నారు. అలాగే ఈ మీటింగ్ కు విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి విందు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పట్టా రవికుమార్, చాపల రవి, ఊడా నరేష్, మందపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రమశిక్షణతో

# మెలిగి ముందంజలో నిలవాలి




**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ముందంజలో నిలవాలనీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాటి సీతారాములు పేర్కొన్నారు. శుక్రవారం ఎటపాక మండలం నల్లకుంట ఆశ్రమ పాఠశాలలో మెగా పేరెంట్ సమావేశం ఘనంగా నిర్వహించారు. నేడు ప్రభుత్వ పాఠశాలలో చదువుకునేందుకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని, విద్యార్దులు ప్రభుత్వం కల్పిస్తున్న సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్దులు చిన్నతనం నుండి క్రమశిక్షణతో చదివి జన్మించిన తల్లి దండ్రులులకు, పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోడే. నాగిరెడ్డి , కారం మోహన్ రావు మల్లం భద్రయ్య, సవలం రామకృష్ణ , అనిగి విజయ కుమార్, సోడే.రవితేజ, సోడే.వీరాజు, సోడే. వేంకట సీతారామరాజు,కారం దారయ్య చిడేం, రవికుమార్ కుమారి పాల్గొన్నారు.

## గుండాల పినపల్లి పాఠశాలలో ఉల్లాసభరిత వాతావరణంలో

# 3.0 మెగా పేరెంట్, టీచర్స్ మీటింగ్



**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి జిల్లా, ఎటపాక మండలం,గుండాల పినపల్లి జిల్లా, పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రధానోపాధ్యాయురాలు పి.శ్రీలక్ష్మి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాఠశాల చైర్మన్ డి.సత్యనారాయణ, మరియు గుండాల సర్పంచ్ గుండి సీతామహాలక్ష్మీ హాజరయ్యారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి పాఠశాల చైర్మన్ డి. సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యణ్, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ద్వారా రాష్ట్రములో విద్యా వ్యవస్థను దేశంలోనే ప్రథమ స్థానంలో పరుగులు పెడుతుందని,అలాగే విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గారి విద్యామిత్ర కిట్లు, డొక్కా మాణిక్యమ్మ మధ్యాహ్నం భోజన పథకం ద్వారాప్రత్యేక సన్న బియ్యం,ఆరోగ్య కరమైన పౌష్టిక ఆహారం,అదించడం జరుగుతుందన్నారు. ,ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి పాఠశాల చైర్మన్, గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల చదువు, భోదనా విధానాలు, క్రీడలు అభివృద్ధి, పాఠశాల మౌలిక వసతుల విస్తరణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఉద్యమం విద్యార్థుల హాజరు, ఫలితాల మెరుగుదల, ప్రత్యేక శిక్షణ తరగతులు, స్వచమైన పర్యావరణం ఏర్పాటు వంటి విషయాలపై తల్లిదండ్రులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు కూడ విద్యార్థుల ప్రగతిని వివరించారు. పాఠశాల అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయాలని, ప్రతీ విద్యార్థి నాణ్యమైన విద్యను అందుకునేలా చర్యలు తీసుకోవాలని సభలో తీర్మానించారు. ఈ సమావేశం ద్వారా పాఠశాల తల్లిదండ్రులు మధ్య అవగాహన మరింత బలపడిందని నిర్వాహికులు తెలిపారు. ఈ సందర్బంగా విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.శ్రీలక్ష్మి, ప్రైమరి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు, సచివాలయం సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మెగా పేరెంట్ మీటింగ్



**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** మెగా పేరెంట్ మీటింగ్ ఎటపాక మండలం ఎంపీపీ పాఠశాల గన్నవరం కాలనీ యందు మెగా పేరెంట్ మీటింగ్ సమావేశం ఘనంగా నిర్వహించారు. పాఠశాలను సుందరంగా అలంకరించారు. ముందుగా విద్యార్థి తల్లిదండ్రులకు,చైర్మన్ లకు పుష్ప గుచ్చం ఇచ్చి విద్యార్దులు ఘనస్వాగతం పలికారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా చైర్మన్ ను ఆహ్వానించారు. ముందుగా సమావేశాన్ని ఉద్దేశించి పాఠశాల చైర్మన్ పిడియాల మోహన్ రావు మాట్లాడుతూ విద్యార్దులు, తల్లి దండ్రులు సమన్వయంతో విద్యార్థుల చదువులు ముందుగు సాగాలన్నారు. తల్లి దండ్రులకు క్రీడలు నిర్వహించి, గెలుపొందిన వారికి ప్రథమ ద్వితీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యురాలు సుస్మిత, వైస్ చైర్మన్ ఖాతునా , కమిటీ నెంబర్ కుంజా శ్రీను, హసీనా, అరుణ, సింధు, రాజేశ్వరి, ప్రమీల, సౌజన్య, పీడియాల వెంకట నర్సు , తదితరులు పాల్గొన్నారు.

# నెల్లిపాక హై స్కూల్‌లో మెగా పేరెంట్ 3.0 మీటింగ్



**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లిపాక గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ సమావేశంలో జరిగిన ముఖ్య అతిథిగా మాజీ తెలుగుదేశం మండల అధ్యక్షులు పుట్టి రమేష్ బాబు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పుట్టి రమేష్ బాబు, పాఠశాల చైర్మన్ బాలరాజు, ఊకె శంకర్, షేక్ ఆషాబి, మండల విద్యాధికారి సరియం రాజులు, పాఠశాల ప్రధానోపాధ్యులు ముచిక చంద్రయ్యా, సిబ్బంది, తల్లి తండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## చోడవరం గ్రామ పంచాయితీలో

# వైస్సార్సీపీ కోటి సంతకాల సేకరణ కార్యక్రమం



**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎటపాక మండలం వైస్సార్సీపీ మండలం అధ్యక్షులు ఆకుల వెంకటరామారావు( పెద్దొడు) అధ్యక్షతన శుక్రవారం ఏటపాక మండలం చోడవరం గ్రామపంచాయతీలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నిర్మించిన 17మెడికల్ కాలేజీ లను కూటమి ప్రభుత్వం ప్రవేటికరణ చేసే దానికి వెతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమం గ్రామ సర్పంచ్ పొడియం మని, సీనియర్ నాయకులు ఎలా మౌలా రమేష్, ఆకుల దయాకర్, శశి కుమార్, రాము, కోడూరు నవీన్, ధార రమేష్, గంటసాల రవి, కరి వెంకటరత్నం, పెరలా మోహనరావు, పొడియం నాగేశ్వరావు, సోడీ నాగేశ్వరావు, సొయాం రాంబాబు, గుండి కృష్ణ, తాటి మంగమ్మ, దాసరి కొండయ్య, కుంజా రమేష్, పెనుబలి ప్రసాద్, సొందే నాగేశ్వర రావు, బుద్దుల లక్ష్మయ్యా, దాసరి శ్రీను, అలాడి రావణయ, పెరలా గోపయ్యా, పెరలా నాగేశ్వరావు, సొడే బాబు, కారం శ్రీను, వాసం భాస్కర్, పొడియం రాజు, సోయం వెంకటేష్, పాయం కమల, పెనుబలి ధర్మమ్మ, సొడే నాగారత్నమ్మ, వసం దేవి, గుండె నాగేశ్వరావు, పొడియం రాజు, తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి మంత్రి నారా లోకేష్

# విదేశీ పర్యటన

### 6వ తేదీ నుంచి 10వరకు అమెరికా, కెనడా టూర్

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ ఈ నెల 6నుంచి 10వతేదీ వరకు 5రోజులపాటు అమెరికా, కెనడా దేశాల్లో పర్యటించనున్నారు. 6వతేదీన తొలిరోజు డల్లాస్ లో తెలుగు డయాస్పోరా సమావేశంలో పాల్గొంటారు. 8,9 తేదీల్లో శాన్ ఫ్రాన్సిస్కో వేదికగా పలు కంపెనీల ప్రతినిధులతో సమావేశమవుతారు. 10వతేదీన కెనడాలోని టొరంటోలో పర్యటిస్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి లోకేష్ అమెరికాలో పర్యటించడం ఇది రెండోసారి. పెట్టుబడుల సాధన కోసం గత 18నెలల్లో మంత్రి లోకేష్ అమెరికా, దావోస్, సింగపూర్, ఆస్ట్రేలియా దేశాల్లో పర్యటించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బ్రాండ్, రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు గల అనుకూలతలను వివరిస్తూ ఇప్పటివరకు మంత్రి లోకేష్ చేసిన పర్యటనలతో ఇటీవల విశాఖలో జరిగిన పార్టనర్ షిప్ సమ్మిట్ లో ఏపీకి పెట్టుబడులు పోటెత్తాయి.

# తల్లితండ్రులు అధ్యాపకుల ఆత్మీయ సమావేశం




**ఎటపాక, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లిపాక నందు తల్లితండ్రులు అధ్యాపకుల ఆత్మీయ సమావేశంఘనంగా నిర్వహించారు.. కళాశాల పురోగతి, విద్యార్థుల విద్యా అభివృద్ధి ప్రమాణాలు.. తల్లితండ్రుల బాధ్యత తదితర అంశాలను కళాశాల ప్రిన్సిపాల్ షేక్ నాగుల్ మీరా మరియు కళాశాల సివిక్స్ అధ్యాపకులు తుర్రం జనార్దన్ తెలియజేశారు.. కళాశాల విద్యార్థిని చిరంజీవి పుసం హిందు మాట్లాడుతూ ఈ కళాశాలలో అధ్యాపకులు చక్కటి బోధనా పద్ధతులు కలిగి అన్ని పాఠాలు చక్కగా చెప్తున్నారని, స్టడీ హావర్స్ లో బాగా చదివిస్తున్నారని, కావున అందరూ సమిష్టి కృషి తో మంచి ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమం విజయవంతం చేసినందుకు అధ్యాపక సిబ్బందికి ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

క్రీడా వాయిస్

# కోహ్లి డబుల్ హ్యాట్రిక్ సెంచరీ..!

## విశాఖ వన్డే టికెట్లు హాట్ కేక్



వన్డే క్రికెట్ లో ఇప్పటివరకు పదమూడు బ్యాట్స్ మెన్ మాత్రమే హ్యాట్రిక్ సెంచరీలు చేశారు. కానీ, మొట్టమొదట ఈ రికార్డు అందుకున్న భారతీయుడు ఎవరో తెలుసా? ఇంకెవరు..?? రన్ మెషిన్ నుంచి టన్ మెషిన్ గా ఎదిగిన విరాట్ కోహ్లి. 2018లో అతడు హ్యాట్రిక్ సెంచరీలు కొట్టాడు. ఆ తర్వాత ఈ రికార్డును రోహిత్ శర్మ కూడా సాధించాడు. ఇక ఒకే సిరీస్ లో హ్యాట్రిక్ సెంచరీలు చేసినవారు పాక్ కు చెందిన జహీర్ అబ్బాస్, దక్షిణాఫ్రికా బ్యాటర్ క్వింటన్ డికాక్ (ఇండియాపై), విరాట్ కోహ్లి (వెస్టిండీస్ పై) మాత్రమే. ఇప్పుడు ఈ రికార్డును మరోసారి సాధించే, మరో ప్రత్యర్థి (దక్షిణాఫ్రికాపై) సాధించే అరుదైన రికార్డు ముంగిట ఉన్నాడు విరాట్. అంతేకాదు.. చరిత్రలో మరే బ్యాటర్ కు సాధ్యం కాని రీతిలో వన్డేల్లో డబుల్ హ్యాట్రిక్ సెంచరీలు చేసిన ఏకైక క్రికెటర్ గానూ నిలిచే అవకాశం అతడి ముందు ఉంది. దీనికి వేదిక మన విశాఖపట్నం కానుండడం కూడా ప్రత్యేకంగా నిలుస్తోంది. దక్షిణాఫ్రికాతో శనివారం విశాఖలో జరగనున్న మూడో వన్డే సిరీస్ విజేతను తేల్చేది కావడంతో మరింత మజా అందిస్తోంది. ఈ సిరీస్ లో భాగంగా రాంచీలో జరిగిన తొలి వన్డేలో టీమ్ ఇండియా 349 పరుగులు చేసినా కేవలం 17 పరుగుల తేడాతో గెలుపొందిన సంగతి తెలిసిందే. రెండో వన్డేలో మాత్రం దక్షిణాఫ్రికా 358 పరుగుల రికార్డు టార్గెట్ ను ఛేదించేసింది. దీంతో మూడో వన్డేలో ఏం జరుగుతుంది? అనే ఆసక్తి నెలకొంది. ఇక తొలి వన్డేలో 135, రెండో మ్యాచ్ లో 102 పరుగులతో సెంచరీలు కొట్టిన కోహ్లి.. బ్యాటింగ్ కు అనుకూలించే విశాఖ పిచ్ పై చెలరేగడం ఖాయం అని అభిమానులు భావిస్తున్నారు. పైగా గత రెండు మ్యాచ్ ల తరహాలో విశాఖలో రాత్రి పూట మంచు ప్రభావం ఉండదు.

**టన్ మెషీన్ కోసం..**

కోహ్లి హ్యాట్రిక్ సెంచరీ చూసేందుకు అభిమానులు ఆసక్తిగా ఉన్నారు. దీంతో విశాఖ క్రికెట్ స్టేడియంలో శనివారం జరిగే మ్యాచ్ టికెట్లు హాట్ కేక్ ల తరహాలో అమ్ముడవుతున్నాయని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ వర్గాలు తెలిపాయి. ఇప్పటికే గత నెల 28న ఆన్ లైన్ లో అమ్మకానికి పెట్టారు. ఇప్పుడు ఆఫ్ లైన్ లో విక్రయాలు సాగిస్తున్నారు. రూ.15 వేల ఖరీదైన టికెట్లు మాత్రమే ఆలస్యంగా అమ్ముడవుతున్నాయి. నవంబరు 30, డిసెంబరు 3న రెండో విడత సేల్స్ మొదలుపెట్టారు. 30న రాంచీలో జరిగిన మ్యాచ్ లో కోహ్లి సెంచరీతో టికెట్ల అమ్మకాలు బాగా ఊపందుకున్నాయి. 3న మరో సెంచరీ కొట్టడంతో మరింత క్రేజ్ ఏర్పడింది. యావరేజ్ ప్రకారం కొట్టినా ఏడు మ్యాచ్ లు 587 పరుగులు.. యావరేజ్ 97పైనే.. ఇదీ విశాఖలో కోహ్లి రికార్డు. మూడు సెంచరీలు, రెండు హాఫ్ సెంచరీలు చేశాడు. ఇప్పుడు యావరేజ్ గా చూసినా కోహ్లి సెంచరీ కొట్టడం ఖాయం అని అభిమానులు భావిస్తున్నారు. అందుకే రాంచీ సెంచరీ తర్వాత విశాఖ వన్డే టికెట్ల అమ్మకాలు ఊపందుకున్నాయని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు చెబుతున్నారు.

# వైట్ వాష్‌కు మైండ్ వాష్..

## గంభీర్.. అగార్కర్‌కు బీసీసీఐ క్లాస్



బీసీసీఐ సమావేశాలు అధికంగా ముంబైలోనే జరుగుతాయి. అక్కడే ప్రధాన కార్యాలయం ఉంది. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా టెస్టు ఫార్మాట్లో ఏడాది వ్యవధిలో స్వదేశంలో రెండు వైట్ వాష్ లు..! అది కూడా ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ వంటి ప్రధాన ప్రత్యర్థులతో కాకుండా, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికాలపై..! గెలిచింది కేవలం బంగ్లాదేశ్, వెస్టిండీస్ వంటి బలహీన జట్లపైనే! వన్డేల్లో శ్రీలంక చేతిలో 27 ఏళ్ల తర్వాత సిరీస్ పరాజయం..! టెస్టులకు ముగ్గురు దిగ్గజాలు అనూహ్య రిటైర్మెంట్.. జట్టులోకి ఎవరిని ఎంపిక చేస్తారో.. మైదానంలో దిగే తుది జట్టులో ఎవరు ఉంటారో తెలియనంతగా మార్పులు.. ఇదేదో పాకిస్థాన్ క్రికెట్ లోని పరిస్థితి కాదు. అత్యంత సమర్థ, అత్యంత ధనిక బోర్డుగా పేరుగాంచిన భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ)లోని పరిస్థితి. దీంతో టీమ్ ఇండియా చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పై విమర్శలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో బీసీసీఐ వారిద్దరితో ఓ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. అది కూడా బుధవారమే అత్యవసరంగా సమావేశం కానుంది. వాస్తవంగా ఇలాంటి భేటీలు సహజమే. కానీ, తాజా ఓటముల నేపథ్యంలో ప్రాధాన్యం సంతరించుకుంది. మరి, ఈ సమావేశం అనంతరం ఎలాంటి నిర్ణయాలు ఉంటాయి? ఏమైనా మార్పులు చేస్తారా? లేక గంభీర్, అగార్కర్ లను సున్నితంగా హెచ్చరించి వదిలేస్తారా? అన్నది చూడాలి.

**ఆకస్మికంగా అంటే...**

బీసీసీఐ సమావేశాలు అధికంగా ముంబైలోనే జరుగుతాయి. అక్కడే ప్రధాన కార్యాలయం ఉంది. కానీ, బుధవారం దక్షిణాఫ్రికాతో రెండో వన్డే జరిగే రాయ్ పూర్ లోనే గంభీర్, అగార్కర్ లతో భేటీ కానుండడం గమనార్హం. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా, సంయుక్త కార్యదర్శి ప్రభ్ తేజ్ సింగ్ పాల్గొంటారు. ఇంత ఆకస్మిక సమావేశానికి కారణం జట్టు ప్రదర్శనే అనే విశ్లేషణలు వస్తున్నాయి. దక్షిణాఫ్రికా చేతిలో ఇటీవలి టెస్టు సిరీస్ వైట్ వాష్ తర్వాత ఈ మీటింగ్ జరుగుతుండడంతో సమీక్ష జరపనున్నట్లు స్పష్టం అవుతోంది. ఇకమీదట ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ఏంచేయాలి? అనే చర్చ సాగనున్నట్లు చెబుతున్నారు. ఏం చేస్తున్నారు మీరు..? గంభీర్, అగార్కర్ వచ్చాక టీమ్‌ఇండియా విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలు ఆశ్చర్యపరుస్తున్నాయి. ఏదో ఒక సాధారణ జట్టు తరహాలో ఈ నిర్ణయాలు ఉంటున్నాయి. ఇలాగే వదిలేస్తే మున్ముందు విమర్శలు తీవ్రం కావడం ఖాయం. వీటిపైనే బీసీసీఐ సమీక్షించే చాన్సుంది. పైగా వచ్చే ఫిబ్రవరి నుంచి టి20 ప్రపంచ కప్, వచ్చే ఏడాది వన్డే ప్రపంచ కప్ ఉన్నాయి. టి20 ప్రపంచ కప్ ను నిలబెట్టుకోవడం, వన్డే ప్రపంచ కప్ నెగ్గడం చాలా ప్రతిష్ఠాత్మకం. అందుకనే గంభీర్, అగార్కర్ నుంచి వారి ప్రణాళికలపై బీసీసీఐ స్పష్టత కోరే చాన్సుందని సమాచారం. టీమ్ ఇండియా వచ్చే ఏడాది జూలైలో టెస్టు మ్యాచ్ లు ఆడనుంది. శ్రీలంకతో జరిగే ఈ సిరీస్ కు ఇప్పటినుంచే ఆలోచించడం సరికాకున్నా, భవిష్యత్ టెస్టు జట్టు నిర్మాణంపైనా ఆలోచన చేయొచ్చు. ఇదే సమయంలో డిసెంబరు 9 నుంచి మొదలయ్యే దక్షిణాఫ్రికాతో టి20 సిరీస్ కు జట్టును కూడా ఎంపిక చేస్తారని భావిస్తున్నారు.

# ఏడిపించడం ఎలాగో ఆ హీరోకి బాగా తెలుసు!



సినిమాలో ఎమోషనల్ సన్నివేశాలు కొన్ని ఉంటాయి. ఆ సమయంలో కంటి నిండా ఏడాల్సి ఉంటుంది. నిజంగా పాత్రలో నీలీనమైతేనే ఎలాంటి గ్లిజరిన్ వేసుకోకుండానే కన్నీళ్లు వస్తాయి. లేదంటే? కళ్లకు గ్లిజరిన్ వాడాల్సి ఉంటుంది. ఇలాంటి ఎక్స్ పీరియన్స్ ఒకటి గతంలో మహేష్ షేర్ చేసుకున్నారు. ఖలేజా సినిమా షూటింగ్ సమయంలో చైతన్య అనే నటుడు ఓ సన్నివేశంలో భాగంగా ఏడవాలి. అది మహేష్ బాబుతో కాంబినేషన్ సీన్. మహేష్ డైలాగ్ చెప్పిన అనంతరం చైతన్య ఏడవాలి. దీంతో మహేష్ ఆ సీన్ కోసం చైతన్యను వెళ్లి గ్లిజరిన్ వేసుకో అని సలహా ఇచ్చాడు. అప్పుడు చైతన్య వద్దు సార్ అని సమాధానం ఇచ్చాడు. ఆ ఆన్సర్ చూసి మహేష్ ఇతడు చాలా ఓవర్ కాన్ఫిడెన్స్ తో ఉన్నాడు? అని భావించాడు. దీంలో ఎలా ఏడుస్తాడో చూస్తానంటూ మహేష్ ఓ రకంగా అతడికి సవాల్ విసిరాడు. కానీ ఆ సవాల్ లో మహేష్ ఓడిపోయాడు. చైతన్య ఆ సీన్ లో నిజమైన ఎమోషన్ పండించడంతో కన్నీళ్లు ప్రవాహంలా వచ్చాయి. సినిమాలో ఆ సీన్ ఎంతో గొప్పగా పండింది. చాలా మంది నటులు గ్లిజరీన్ మాత్రమే వాడతారు. సహజంగా ఏడవడం అన్నది చాలా మందికి సాధ్యం కాదు. తాజాగా అనన్య పాండే కు కూడా ఈ విషయంలో షారుక్ ఖాన్ ఓ టెక్నిక్ చెప్పినట్లు గుర్తు చేసుకుంది. చనిపోయిన వ్యక్తి గురించి భాధపడే సన్నివేశంలో సహజంగా భావోద్వేగాలు పండించడానికి షారుక్ ఓ సలహా ఇచ్చారు. ఏదైనా సినిమాలో ఎవరైనా మరణించే సన్నివేశంలో ఉన్నప్పుడు ఆ వ్యక్తి చనిపోయాడు అని ఆలోచించే బధులు అతను లేకుండా జీవితం ఎలా ఉంటుందో ఊహించుకో. ఆ వ్యక్తితో సంతోషకరంగా గడిపిన క్షణాలను గుర్తు చేసుకోండి. అది మిమ్మల్ని బాధపెడుతుంది. అప్పుడు గ్లిజరిన్ లేకుండానే కన్నీళ్లు వస్తాయి అని సలహా ఇచ్చారు. ఈ టెక్నిక్ ని అనన్యా పాండే చాలా సినిమాల్లో వాడినట్లు తెలిపింది. సెట్ లో చుట్టూ ఉండే వాతావరణం భిన్నంగా ఉంటుంది. కొన్ని సార్లు సన్నివేశాలకు సెట్ వాతావరణం సింక్ అవుతుంది. కొన్ని సార్లు సింక్ అవ్వదు. అలాంటప్పుడు సీన్ లో పర్ఫెక్షన్ మిస్ అవుతుంది. ప్రతీ పాత్రలోనూ ఒదిగిపోవడం అన్నది ఏ నటికి సాధ్యం కాదు. మనసుకు బాగా నచ్చితే తప్ప ఆ పాత్రలో లీనమవ్వడం కష్టం. అలాంటి పాత్రలు కొన్ని మాత్రమే ప్రతీ ఒక్కరి కెరీర్ లో ఉంటాయి. ఆ సినిమాలు హిట్ అయినా? కాకపోయినా ఆ పాత్రలు మాత్రం ఎప్పటికీ గుర్తిండిపోతాయి.

సినీ వాయిస్ CINEMA



# ఏంటన్నా ఇలా మారిపోయావ్..

హీరోగా టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్! టైటిల్ కూడా అద్దిరిపోయింది సాధారణంగా హీరోలు కూడా డైరెక్షన్ చేస్తుంటారు. కెమెరా ముందు నుంచే కాకుండా కెమెరా వెనక నుంచొని యాక్షన్, కట్ అని చెబుతుంటారు. అయితే డైరెక్టర్లు హీరోలుగా మారడం చాలా అరుదు అని చెప్పవచ్చు. అయితే ఇప్పుడు ఓ టాలీవుడ్ సంచలన దర్శకుడు హీరోగా మారాడు. పై ఫొటోను గమనించారా? అందులో ఉన్నదెవరో గుర్తు పట్టారా? చాలా మంది గుర్తు పట్టేసే ఉంటారు. ఎందుకంటే ఆయన ఏం చేసినా సంచలనమే. గతంలో సినిమాలు చేయకున్నా తరచూ వార్తల్లో ఉంటారు. తన సోషల్ మీడియా పోస్టులు, కామెంట్స్ తో తరచూ ట్రెండింగ్ లో ఉంటారు. ఒకప్పుడు తన సినిమాలతో బాక్సాఫీస్ ను షేక్ చేసిన రామ్ గోపాల్ వర్మ హీరోగా ఎంట్రీ ఇవ్వనున్నాడు. ఆయన ప్రధాన పాత్రలో ఒక సినిమా తెరకెక్కుతోంది. రామ్ గోపాల్ వర్మకు బాగా ఇష్టమైన గ్యాంగ్ స్టర్ బ్యాక్ డ్రాప్ లో నే ఈ సినిమా తెరకెక్కుతోంది. ఈ సినిమాతో నూతన దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. గతంలో రామ్ గోపాల్ వర్మతో ఐస్ క్రీమ్, ఐస్ క్రీమ్ 2 సినిమాలు చేసిన తుమ్మలపల్లి రామ సత్యనారాయణ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. కాగా ఒకప్పటి స్టార్ హీరో సుమన్ ఈ సినిమాలో విలన్ గా చేస్తుండడం మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇటీవల సైలెంట్ గా ఈ సినిమా షూటింగ్ స్టార్ట్ చేసుకుంది. వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా ట్రైలర్ రిలీజ్ చేస్తామని, అప్పుడే మూవీ రిలీజ్ డేట్ ను కూడా అనౌన్స్ చేస్తామని మేకర్స్ ప్రకటించారు. అన్నట్లు రామ్ గోపాల్ వర్మ హీరోగా తెరకెక్కుతోన్న సినిమా పేరు ఏమనుకుంటున్నారా? చాలా మంది ఆయనను షో మ్యాన్ అంటారు. ఇప్పుడు అదే టైటిల్ తో అభిమానుల ముందుకు వస్తున్నాడు ఆర్జీవీ. 'షో మ్యాన్'.. 'మ్యాడ్ మాన్ స్టర్' అనేది ఈ మూవీ ట్యాగ్ లైన్. ఈ సినిమాలోని ఇతర నటీనటులు, క్యాస్టింగ్ గురించి త్వరలోనే అన్ని వివరాలు తెలియనున్నాయి. గతంలో ఒక డైరెక్టర్ గా సినిమా ఇండస్ట్రీని షేక్ చేసిన రామ్ గోపాల్ వర్మ ఇప్పుడు హీరోగా ఏ మాత్రం ఆకట్టుకుంటాడో చూడాలి.అయితే ఈ సినిమాపై స్పందించిన రామ్ గోపాల్ వర్మ ఇది ఫేక్ న్యూస్ అని, ఎవరో ఏఐ సాయంతో ఇలా క్రియేట్ చేశారని ట్వీట్ పెట్టాడు. అయితే కొందరు మాత్రం రామ్ గోపాల్ వర్మ కావాలనే ఇలా చేస్తున్నాడని అభిప్రాయపడుతున్నారు.

# దళపతి దిగితే చిరంజీవికి ఇబ్బందేనా..?



సంక్రాంతికి ఇప్పటికే కొన్ని సినిమాలు లాక్ అయ్యాయి. ప్రధానంగా నాలుగు సినిమాల మధ్య గట్టి పోటీ కనిపిస్తుంది. ది రాజాసాబ్, మన శంకర వరప్రసాద్, భర్త మహాశయులకు, నారీ నారీ నడుమ మురారీ లాంటి చిత్రాల మధ్య పోటీ తప్పదు. వీటితో పాటు, కోలీవుడ్ నుంచి దళపతి విజయ్ నటిస్తోన్న జన నాయగన్ కూడా రిలీజ్ అవు తుంది. ఇంత పోటీ ఉన్నా? నేనెక్కడా తగ్గనంటూ నవీన్ పోలిశెట్టి కూడా అనగనగా ఒక రాజుతో వస్తున్నాడు. మరి వీరందరిలో థియేటర్ల పరంగా సేఫ్ లో ఉన్నది ఎంత మంది? అంటే... ది రాజాసాబ్ జనవరి 9న రిలీజ్ అవుతుంది.

**థియేటర్లు అన్ని కళకళ:**

సంక్రాంతి రేసులో మొట్ట మొదట రిలీజ్ ఇదే కావడంతో? భారీ ఎత్తున ముందుగానే థియేటర్లను బ్లాక్ చేస్తుంది. అదే రోజున జన నాయగన్ కూడా రిలీజ్ అవుతుంది. ఈ సినిమా కూడా కొన్ని థియేటర్లను ముందుగానే లాక్ చేస్తుంది. అయితే జన నాయగన్ థియేట్రికల్ రిలీజ్ లో ఎంత స్ట్రాంగ్‌గా ఉంటుంది? అన్నది రిలీజ్ చేసే సంస్థ మీద ఆధారపడి ఉంటుంది. అగ్ర సంస్థ రంగంలోకి దిగిందంటే థియేటర్ల పరంగా చూడాల్సిన పనిలేదు. ఇదే జరిగితే గనుక ఆ ఎఫెక్ట్ చిరంజీవి సినిమాపై పడే అవకాశం లేకపోలేదు. శంకర వరప్రసాద్ రిలీజ్ తేదీ ఇంకా ప్రకటించలేదు. సంక్రాంతికి అని కర్చీఫ్ వేసారు కానీ, తేదీ విషయంలో ఇంకా క్లారిటీ లేదు. జనవరి 9 తర్వాతే రిలీజ్ అవుతుంది. కానీ తేదీపై క్లారిటీ లేకపోవడం అన్నది చిక్కుగా మారింది. జన నాయగన్ ని పెద్ద సంస్థ రిలీజ్ చేస్తే థియేటర్లన్నీ బ్లాక్ అవుతాయి. ఇన్ని రోజులు పాటు ఆడించాలి అనే కండీషన్ ఉంటుంది. అదే సినిమాకు హిట్ టాక్ వచ్చిందంటే? వర ప్రసాద్ పరిస్థితి మరింత జఠిలంగా మారుతుంది. ఆ సినిమా కంటూ ఫిక్స్ డు గా కొన్ని థియేటర్లు ఉన్నా? అప్పటికప్పుడు అదనంగా థియేటర్ల సంఖ్యను పెంచడం అన్నది అంత ఈజీగా జరగదు. పంపిణీ సంస్థల నుంచి కూడా కొంత ఒత్తిడి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రేక్షకులు కూడా హిట్ టాక్ వచ్చిన సినిమా లకే వెళ్తున్నారు. సినిమాపై ఏమాత్రం నెగిటివ్ టాక్ ఉన్నా? అందులో ఎంత పెద్ద స్టార్ నటించినా చూడటం లేదు. జన నాయగన్ బాలయ్య నటించిన భగవంత్ కేసరికి రీమేక్ అంటున్నారు. కాబట్టి బాలయ్య ఫ్యాన్స్ జన నాయగన్ లో కొత్తగా ఏం చూపించారు? అన్న ఆసక్తితో అటువైపు గా మళ్లే అవకాశం లేకపోలేదు. ఇటీవలే బాలయ్య అసెంబ్లీలో చిరంజీవిని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు అభిమానుల మధ్య కొంత వైరానికి కూడా దారి తీసాయి. సోషల్ మీడియా వేదికగా ఇరు హీరోల అభిమానులు దూషించుకోవడం జరిగింది. మిగతా చిత్రాలు ఈ రిలీజ్ లను బట్టి ప్లాన్ చేసుకునే అవకాశం ఉంది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com